Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 15 | సంచిక: 363 | కరీంనగర్ | శుక్రవారం 16 మే, 2025 | పేజీలు: 12 | వెల: 2.00

## సౌదీలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, మే 15 : సౌదీ అరేబియాలో కోదాడకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షేక్ తాజుద్దీన్ సౌదీలో పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సౌదీ పోలీసులు ఆలస్యంగా తాజుద్దీన్ కుటుంబ సభ్యులకు తెలియ జేశారు. సౌదీలో కపిల్ అనే వ్యక్తితో తాజుద్దీన్‌కు కొద్ది రోజులుగా గొడవలున్నాయని, అతడే కాల్చి చంపి ఉంటాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని కోదాడకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

## నాంపల్లి వద్ద రౌడీషీటర్ దారుణ హత్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 15 : నగరంలోని నాంపల్లిలో దారుణం చోటు-చేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్,కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. స్థానికులు బయాందోళనలకు గురయ్యారు.



# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి , మే 15 : కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం



ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈమహాక్రతువు జరగనుంది.

8లో

### పుష్కరాలలో పుణ్య స్నానం చేస్తే

## పుణ్యం లభిస్తుంది

**- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, మే 15 : పుష్కరాలలో పుణ్య స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం సరస్వతి పుష్కరాలకు 4.12 నిమిషాలకు కాళేశ్వరం విచ్చేసిన ముఖ్యమంత్రి ఎం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్ సిటీని పరిశీలించారు. అనతరం 17 అడుగుల ఏక శిలా సరస్వతి మాతా విగ్రహాన్ని ఆవిష్కరించారు.సరస్వతి ఘాట్‌ను ప్రజలకు అంకితం చేశారు. తదుపరి పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని, శుభానందదేవిని, ప్రౌడ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనతరం సరస్వతి ఘాట్ లో పుష్కరాలపై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంనా హయంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహిం చడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో అయినా నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని తెలిపారు.




8లో

### కాళేశ్వరం వేద మంత్రోఛ్చారణలతో

# మారు మ్రోగింది

**- సరస్వతీ పుష్కరాలను లాంచంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి , మే15: కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోఛ్చారణలతో మారు మ్రోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. గురువారం వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగానిలిచింది. ఇప్పటి వరకూ సాంప్రాదాయానికే పరిమితమైన సరస్వతి పుష్కరాలు ఈ సారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.44 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభంఅయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్‌లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద,భూపాలపల్లిఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

8లో





## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

- రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?
- రాష్ట్రపతి, గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం
- సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి
- రాజ్యాంగ ధర్మాసం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 15 : తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను

8లో

### కర్నల్ సోఫియా ఖురేషీపై

## అనుచిత వ్యాఖ్యలు

- ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి
- మధ్యప్రదేశ్ మంత్రికి సుప్రీం ఆదేశాలు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 15 : సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండని ఆగ్రహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగా కుండా ఆయన తీరును తప్పుపట్టింది.

8లో

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా

**- ఈ నెల 20న దేశ వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు, సమీకరణలు - కేంద్ర కార్మిక సంఘాల వేదిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 15: కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, సంఘాల సంయుక్త వేదిక ఈ నెల 20న జరపతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జూల్కె 9 కి వాయిదా వేశాయి. ఈ నెల 20న

8లో



## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

- తక్షణమే చెల్లించి ఆదుకోండి
- సిఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 15 : తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. 8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు.



8లో



## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

- ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం
- బీహార్ పర్యటనలో రాహుల్ విమర్శలు

పాట్నా, మే 15 : దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా

8లో

# హరీష్ రావుపై రేవంత్ వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, మే 15 : ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. కరీంనగర్ లోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకత్వం అనేది వాటి అంతర్గత వ్యవహారం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ని చేశారు. మమ్మల్ని అడిగి చేశారా ? ఆయన్ను ఎందుకు పెట్టారు దళితుడికి ఎందుకు ఇవ్వలేదు అని మేము అడిగామా ? బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేసే పార్టీ అని అన్నారు. ఎవరైతే తెలంగాణ ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటుంది..! దళిత ముఖ్యమంత్రి అన్నది 2014 కి ముందు..! మేము అధికారం లోకి రాలేదు విజయ రామారావును బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా నియమించాం..! వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్నిఅభివృద్ధి చేసే విజన్‌ను సిద్ధం చేసుకున్న కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకుని పార్టీ తెలంగాణ ముక్త కంఠంతో నిర్ణయం తీసుకుంది అందుకే దళితుడు సీఎం కాలేదు..! తెలంగాణ రాష్ట్రం కొత్తగా వచ్చిన రాష్ట్రం కనుక కేసీఆర్ తప్ప ఎవ్వరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేది..! రేవంత్ రెడ్డి సీఎం అయినంక చూస్తున్నాం రాష్ట్రం పరిస్థితి ఏమయిందో ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడు. నడిపేదంతా రాహుల్ అని జనానికి తెలియదా..? సోనియా రాహుల్ గాంధీ ,ప్రియాంక గాంధీ జపం తప్ప కాంగ్రెస్‌లో ఏమైనా ఉందా..! రాహుల్, ప్రియాంకలకు ఏ హోదా ఉన్నదని రేవంత్ గత ఎన్నికల్లో డిక్లరేషన్లు ప్రకటింప జేశారు..! హామీల అమలుకు తమది గ్యారంటీ అని వాళ్ళు ఎలా చెప్పారు ? బీఆర్ఎస్ పగ్గాలు దళితునికి ఇవ్వాలంటున్న రేవంత్ రెడ్డి ఖర్గేను పీఎం చేస్తామని ఎందుకు అనడం లేదు ? రాహుల్‌ని పీఎం చేస్తామని ఎందుకు అంటున్నారు. రాహుల్ నాయకత్వంలో పని చేద్దాం అని రేవంత్ అంటారే తప్ప ఖర్గే నాయకత్వం గురించి మాట్లాడతారా ? కులగణన రాహుల్ చెప్తే చేశాం అంటాడు తప్ప ఖర్గే సూచనలతో అని ఎపుడైనా రేవంత్ అన్నాడా? 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు కుల గణన ఎందుకు నిర్వహించలేదు...? దళితుల పట్ల కాంగ్రెస్ ది, రేవంత్‌ది మొసలి కన్నీరే.. పెదవుల మీద ప్రేమ తప్ప దళితులకు పదవులిచ్చే ప్రేమకాదు..! మల్లికార్జున ఖర్గే ను పార్టీ అధ్యక్షుడిగా చేశారు అంటున్నారు..! 1985 నుండి ఇప్పటి వరకు ఎంత మంది దళితులను ప్రెసిడెంట్ గా చేశారు..! 98 మంది ప్రెసిడెంట్‌లో కనీసం నాలుగురు దళితులు లేరు. గాంధీ కుటుంబానికి తప్ప వేరే ఎవరికైనా ప్రధాని పదవిని ఇచ్చారా...? పి.వి.ని కనీసం పోగు పోయనివ్వలేదు..మన్మోహన్ సింగ్ ను ప్రధానిని చేసిన చైర్మన్‌గా సోనియా గాంధీ అసలు అధికారం వెలగబెట్టింది..! మోతిలాల్ నెహ్రూ రెండేళ్లు, జవహర్లాల్ నెహ్రూ 9 ఏండ్లు, ఇందిరాగాంధీ ఆరేళ్లు, రాజీవ్ గాంధీ ఆరేండ్లు, సోనియా గాంధీ 21 ఏళ్లు, రాహుల్ గాంధీ రెండేళ్లు మొత్తం కుటుంబం కాంగ్రెస్‌కు 46 ఏళ్ళు అధ్యక్ష స్థాయిలో ఉన్నారు.. ఇదేనా మీ సామాజిక న్యాయం..! దళితుల్లో దామోదర సంజీవయ్య, జగ్జీవన్ రామ్, ఖర్గే లు మాత్రమే ఏఐసీసీ అధ్యక్షులుగా ఉన్నారు, వీరి పదవి కాలం ముష్టి మూడేళ్ళు మాత్రమే..! జనం మార్పు కోరుకున్నారు కాబట్టి మీరు అధికారంలోకి వచ్చారు..! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దమ్ముంటే దామోదర రాజనరసింహ ను లేదా వివేక్ వెంకటస్వామి లను ముఖ్యమంత్రిని చేయండి..! కెసిఆర్ క్యాబినెట్‌లో నేను చీఫ్ విప్‌గా, మంత్రిగా పని చేసిన విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారనుకుంట..! మా నాయకుడు కెసిఆర్, పార్టీ బిఆర్ఎస్ మేము మా నాయకుడు అడుగు జాడల్లో నడుస్తాం, కాంగ్రెస్ పార్టీ లో నిర్ణయం తీసుకోవాలన్న ఢిల్లీకి వెళ్లి లాబింగ్ చేయాల్సిందే కాంగ్రెస్ పార్టీలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు ? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో మంత్రి వర్గ విస్తరణ చేస్తే, తన ముఖ్యమంత్రి పదవికి ఎసరు వస్తుందని బయపడుతున్నారు. బిల్లా రంగా అని మా నేతలను సంబోధించడం ద్వారా రేవంత్ సీఎం పదవి స్థాయిని తగ్గించారు. రేవంత్ బిల్లా రంగాల స్థాయి ఎపుడో దాటి పోయారు చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారు..! పాలన చేత కాక పనికి రాని మాటలు మాట్లాడుతున్నారు..! అంబెద్కర్ ను ఓడించి జగ్జీవన్ రామ్ ను అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ కి మాకు నీతులు చెప్పే అర్హత ఉందా..? దళితులకు రెండు సార్లు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌ది. రేవంత్ కు దళితుల ప్రేమ ఉంటె ఓ దళితుణ్ణి సీఎం చేయండి బీఆర్ఎస్ ఎప్పుడేమి చేయాలో కూడా రేవంత్ రెడ్డి చెబితే మేము ఎందుకు ? బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగ్గించి పాలన మీద ద్రుష్టి పెట్టు రేవంత్ సీఎం పదవిలో ఉంటూ వేరే వాళ్ళను సీఎం అనే స్థాయికి రేవంత్ వెళ్లాడంటే ఆయన మతి భ్రమించింది అనుకోక తప్పదు. ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల దళిత డిక్లరేషన్ అమలు గురించి రేవంత్ ఆలోచించాలి. బీఆర్ఎస్ నాయకత్వం గురించి తర్వాత ఆలోచించవచ్చు ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రఘువీర్ సింగ్, గుంజపడుగు హరిప్రసాద్, మైకేల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు






# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

## - నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 15 : సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా 1, 2, 3, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలోని నిరుద్యోగ యువతీ, యువకులకు సుమారు 100కు పైగా కంపెనీలలో, 3వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన కోసం ఈ నెల 18న ఆదివారం గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో 'మెగా జాబ్ మేళా' నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఇది ఒక సువర్ణావకాశమని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, ఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో ఆర్జీ-1 జిఎం లలిత్ కుమార్, ఆర్జీ-2 జిఎం బండి వెంకటయ్య, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, డిజియం ఎస్టేట్ కుమార్, ఎస్.సి సివిల్ వర ప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామిలు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

## - 100 కంపెనీలు.. 3 వేల ఉద్యోగ అవకాశాలు


## - నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : సీ ఎండీ ఎన్. బలరామ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 15 : సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రామగుండం-1 ఏరియా గోదావరిఖనిలో ఈనెల 18న ఆదివారం సింగరేణి ఆధ్వర్యంలో 'మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు సింగరేణి సీ, ఎండీ ఎన్.బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు.100 ప్రైవేటు సంస్థలలో వివిధ విభాగాల్లో 3 వేల ఖాళీలు భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంటోందని, ఈ నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి జాబ్ మేళాలు ఇకపై ఇతర ఏరియాలలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగ నియామకాలతో పాటు, నిరుద్యోగ యువత అందరికీ ఏదో ఒక ఉపాధి లేదా ఉద్యోగం కల్పించడం కోసం ఈ తరహా కార్యక్రమాలను సింగరేణి సంస్థ స్వచ్ఛందంగా చేపడుతుందని, ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ కోల్ బెల్ట్ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను



ఇప్పటికే మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాలలో ప్రారంభించామని, ఇతర ఏరియాలలో కూడా త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వీలుగా జాబ్ మేళాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



# సింగరేణిలో సమ్మెవల్ల ఉద్యోగులకు, సంస్థకు ఆర్థిక నష్టం

## - భూపాలపల్లి ఏరియా జి.ఎం. ఏ. రాజేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి, మే 15: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో ఈ నెల 20న జరపతలపెట్టిన సమ్మె వల్ల అటు ఉద్యోగులకు, ఇటు సంస్థకు ఆర్థిక నష్టం చేకూరుతుందని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఒక్క రోజు సమ్మెను ధృష్టిలో పెట్టుకుని గురువారం సాయంత్రం స్థానిక జి.ఎం. కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని డిపార్ట్ మెంట్ల, గనుల అధికారులతో జరిగిన సమావేశానికి జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమ్మెవల్ల ఏర్పడే పరిణామాల కోసం అధికారులతో చర్చించారు. సమ్మె చేయడం వల్ల జరిగే ఆర్థిక నష్టం గురించి, సంస్థకు జరిగే నష్టం గురించి ఉద్యోగులకు వివరించాలని జి.ఎం. అధికారులకు సూచించారు. అంతేకాకుండా సమ్మె జరిగినట్లయితే ఏరియాలోని గనులలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడడమే కాకుండా, ఉత్పత్తి అయిన బొగ్గును ఎక్కువ మొత్తంలో సరఫరా అయ్యేటట్లు అధికారులు ముందు చూపుతో వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్వోటూజిఎం ఎస్.కవీంద్ర, ఏరియా ఇంజనీర్ ఎం.ఎర్రన్న, ఎజిఎం (ఐ.ఇ) డి.జ్యోతి, ప్రాజెక్ట్ అధికారి వెంకటరామ రెడ్డి, ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, అన్ని గనుల ఏజెంట్లు, మేనేజర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## శాతవాహన వర్శిటీలో న్యాయ కళాశాలకు

# బార్ కౌన్సిల్ అనుమతి రావడం పట్ల బిజెపి శ్రేణుల హర్షం

## - ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్ - బండి సంజయ్ కుమార్‌ల చిత్రపటానికి పాలాభిషేకం - న్యాయ కళాశాల మంజూరు కోసం - కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎనలేని కృషి - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, మే 15 : కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి రావడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రోజున యూనివర్సిటీ ప్రాంగణం వద్ద ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ మెగ్వాల్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కాలేజీ మంజూరు కోసం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినందుకు , లా కాలేజీ నీ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్, బండి సంజయ్ కుమార్ కు భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేసినట్లు చెప్పారు. ప్రధానంగా 120 మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సుకు, ఈ సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇది లా విద్యను అభ్యసించే వారి భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనం మేలు చేసే విషయమన్నారు. ముఖ్యంగా గతంలో శాతవాహన వర్సిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారని, ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లి, సంబంధిత శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ బండి సంజయ్ కుమార్ వినతి పత్రం సమర్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై శాతవాహన వర్సిటీని వర్చువల్ గా తనిఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిందన్నారు. లా కాలేజీ కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ పట్టు పట్టి సాధించారని, ముఖ్యంగా బండి సంజయ్ కృషికి, వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ శాతవాహన వర్సిటీకి లా కాలేజీకి అనుమతి ఇవ్వడంతోపాటు, విద్యా సంవత్సరం (2025-26) నుండి ఎల్ఎల్‌బి కోర్సు ప్రారంభమయ్యే విధంగా తగిన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రోగ్రాం అనంతరం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను బిజెపి శ్రేణులందరూ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్ప గుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు , లీగల్ సేల్ జాయింట్ కన్వీనర్ చంద్రమౌళి, లీగల్ సెల్ బాధ్యులు కిరణ్ సింగ్,వెన్న ఆనందం, కామారపు విశ్వప్రసాద్, సందూరి భూమి రెడ్డి, బండారి శ్రీనివాస్ ,చంద్రపాటి కిరణ్ కుమార్ ,తిరునహరి ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, ఎస్.దత్తాత్రేయ, కొట్టె వంశీకృష్ణ, చంద్ర ప్రకాష్ రెడ్డి, ఆనంద భాస్కర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్లు దండు కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, ఏన్నం ప్రకాష్, దూలం కళ్యాణ్, జాడి బాల్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, పొన్నాల రాము, అడిచర్ల రాజు, మామిడి చైతన్య, బండారి గాయత్రీ దేవి, మల్లేశం, వాసు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యకి అరెస్ట్

## - 1.907 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : నిర్మల్ జిల్లా కడెం మండలం లోని కొండపూర్ వద్ద నిషేధిత గంజాయిని ఆటోలో రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు చింతగూడ తండా ,అల్లంపల్లి గ్రామానికి చెందిన బదల నూర్ సింగ్ ఆటో డ్రైవర్, గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం సుమారు 10.00 గం.ల ప్రాంతములో రూరల్ ఎస్సై జి.లింబాద్రికి ఒక నమ్మదగిన సమాచారం ఇవ్వడంతో నిందితుడు కడెం వైపు నుండి ఆటో లో నిషేధిత గంజా తీసుకోని నిర్మల్ వైపు రాగా సిబ్బంది ఏఎస్ఐ బాబారావు, హెచ్ సి రాజేశ్వర్ పిసిఎస్ సంతోష్, అజిజ్, జితేందర్, లు కలిసి కొండాపూర్ వద్ద ఆటో బిఎన్ టిఎస్ 0868ను పట్టుకొని తనిఖీ చేసి నిషేదిత గంజాయిని అతని వద్ద నుండి సుమారు లి1.907 కేజీల ఎండు గంజాయిని స్వాధీనపరచుకున్నారు.ఈ కేసు విషయములో ఎస్పీ నిర్మల్ రాజేష్ మీనా నేతృత్వములో సమాచారం సేకరించి గంజాయి రవాణా చేసిన నిందితుడిని అరెస్టు చేసిన నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మున్నూరు కృష్ణ, జి.లింబాద్రి, సిబ్బంది ఏఎస్ఐ బాబారావు హెచ్ సి రాజేశ్వర్ పోలీస్ కానిస్టేబుల్ సంతోష్, అజీజ్,జితేందర్ బాలాజీ లను నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల అభినందించారు.

# రామగుండంలో రూ.58 కోట్ల అభివృద్ధి పనులు

- డార్క్ స్పాట్ లేకుండా 352 విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- కార్పొరేషన్ పరిధిలో 45 కోట్లతో నూతన సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచేలా నూతన వాహనాలు, పరికరాల కొనుగోలు
- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 15 : గత సంవత్సర కాలంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 58 కోట్ల 43 లక్షల విలువగల అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగిందని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా 9 కోట్ల 64 లక్షల రూపాయలు, ఎల్ఆర్ఎస్ ఇంట్రెస్ట్ ఫండ్స్ క్రింద 84 లక్షల రూపాయలు, 14వ ఆర్థిక సంఘం క్రింద 50 లక్షల రూపాయలు, టియుఎఫ్ఐడిసి క్రింద 45 కోట్ల రూపాయలు, ప్రత్యేక అభివృద్ధి కింద కోటి 84 లక్షల రూపాయలు, వరద సహాయ నిధుల కింద 65 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసామని అన్నారు. నగరంలో డార్క్ స్పాట్ లేకుండా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించామన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, నూతన డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించి 80 లక్షల రూపాయలతో 8 ట్రాక్టర్లు, 65 లక్షల 50 వేల రూపాయలతో 8 ట్రాలీలు, 47 లక్షల రూపాయలతో 5 ట్రాక్టర్ విత్ ట్రాలీలను, 76 లక్షల రూపాయలతో 2 జేసిబీలను పారిశుధ్యం మెరుగ్గా నిర్వహించేందుకు కొనుగోలు చేశామని తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి అవసరమైన భద్రత సామాగ్రి కోసం 4 లక్షల 50 వేలు ఖర్చు చేశామని తెలిపారు. 83 లక్షల రూపాయలతో డ్రై రిసోర్స్ కేంద్రం, 5 ఇంక్లైన్ కాలనీ వద్ద కోటి 43 లక్షల రూపాయలతో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేశామని ఆయన వివరించారు. 4 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రామగుండం నగరంలో నీటి సరఫరా కనెక్షన్స్, అవసరమైన డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ వేయడం వంటి పనులు పూర్తి చేశామని అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో డార్క్ స్పాట్ ఉండకుండా ఎల్ఆర్ఎస్ వడ్డీ సొమ్మును వినియోగించి 20 లక్షల రూపాయలతో స్ట్రీట్ లైట్స్, 25 లక్షల రూపాయలతో 400 ఎల్ఈడి లైట్స్, 36 లక్షల రూపాయలతో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపట్టి పూర్తి చేశామని అన్నారు. నగరంలో 352 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి డార్క్ స్పాట్ లేకుండా చేశామని పేర్కొన్నారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టియూఎఫ్డిసి) ద్వారా 45 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నగరంలోని వివిధ డివిజన్లలో అవసరమైన చోట సీసీ రోడ్డు, మురికి కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా కోటి 80 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఓపెన్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసామని అన్నారు. వరద సహాయక నిధుల నుంచి 65 లక్షల రూపాయలు ఖర్చు చేసి మ్యాన్ హెూల్స్ మరమ్మతు పనులు పూర్తి చేశామన్నారు. గత సంవత్సర కాలంలో రూ. 58 కోట్ల 43 లక్షలు ఖర్చుచేసి అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాబోయే రోజులలో కూడా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు మరిన్ని నిధులు ఖర్చు చేసి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ శ్రీహర్ష ప్రకటనలో తెలిపారు.





## "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"

- దహెగాం గ్రామ రైతులకు వ్యవసాయంపై అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : నిర్మల్ జిల్లా, మే 15: నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని దహెగాం గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమాన్ని ఏరువాక కేంద్రం, ముధోల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి నర్సయ్య మాట్లాడుతూ పంట మార్పిడి వలన కలిగే లాభాలను, పంటల ద్వారా ఆదాయాన్ని ఎలా పొందాలో రైతులకు వివరించారు. శాస్త్రవేత్త డా.కే.విజయ్ కుమార్ మాట్లాడుతూ, వివిధ పంటలలో అవసరమైన రసాయనాల వినియోగం వలన పంట శాతం పెరిగే భూమిని అధిక రసాయనాల నుంచి కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా సాగు నీటిని అధా చేయటం వలన భూమిలో నీటి లోటు రాబోయే రోజులలో రాకుండా చేసుకోవచ్చని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కార్తిక్ మాట్లాడుతూ చెట్లు పెంచడం వలన పర్యావరణానికి కలిగే మేలు గురించి రైతులకు తెలపడం జరిగింది. ఏవో మనీషా మాట్లాడుతూ రైతులు విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసిన రశీదులను భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. అలాగే రశీదులు భద్రపరచడం వలన పంట నష్టపోయే స్థితిలో నష్ట పరిహారాన్ని పొందడం గురించి వివరించారు. అనంతరం ఎఇఒ సిరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా పొందే గుర్తింపు కార్డ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమములో మాజీ సర్పంచ్ నాగోరావు, ఎఇఒ సంఘవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు


- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - నేడు రుద్రంగిలో పర్యటించనున్న మంత్రుల బృందం
- రెవెన్యూ, బీసీ శాఖ మంత్రుల పర్యటనకు చేయాల్సిన - ఏర్పాట్లపై ప్రభుత్వ విప్ సమీక్ష సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 15 : రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే లతో కలిసి చేయాల్సిన ఏర్పాట్ల పై విప్ గురువారం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతి చట్టం ముందస్తుగా 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఒక మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రుద్రంగి భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గతంలో ప్రభుత్వ భూములు వ్యవసాయ చేస్తున్న పేదలకు, దళితులు గిరిజనులకు అసైన్డ్ పట్టాలు, పోడు భూముల పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. గత ధరణి చట్టం సమయంలో అసైన్మెంట్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ధరణి వ్యవస్థతో పేదలకు అనేక ఇబ్బందులు వచ్చాయని, సమస్యల పరిష్కారానికి రూల్స్ తీసుకుని రాలేదని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మేరకు నూతనంగా భూ భారతి చట్టం రూల్స్ తో సహా ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అధ్యక్షుడిగా అసైన్మెంట్ కమిటీలను కూడా ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని విప్ తెలిపారు. అసైన్మెంట్ కమిటీల ద్వారా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటూ పట్టాలు రాని అర్హులు ఎవరైనా ఉంటే వారికి తప్పనిసరిగా అందజేస్తామని ప్రకటించారు. రుద్రంగి మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వస్తారని తెలిపారు. రుద్రంగి మండలంలో మంజూరైన 243 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా హౌసింగ్ శాఖ మంత్రి చేతులమీదుగా జరుగుతుందని తెలిపారు. రుద్రంగిలో ఇంటి కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఇంకా ఏమైనా పెండింగ్ లో ఉంటే వెంటనే మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను విప్ ఆదేశించారు. మంత్రి పర్యటనకు రైతులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుద్రంగి లో పర్యటించనున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత ప్రజా ప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు సూచించారు. రెవెన్యూ సదస్సుల వద్ద పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ మొదలగు ఏర్పాట్లను ఎంపీడీవో పకడ్బందీగా పూర్తి చేయాలని, హెలిపాడ్ వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, టెంట్, కుర్చీలు , సభా వేదిక వంటి ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారి పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అంబులెన్స్ అందుబాటులో పెట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశం వద్ద ఫైర్ ఇంజన్ అందుబాటులో పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోసి ప్రారంభించే కార్యక్రమ ఇంటి స్థలాలు, హెలిపాడ్, బహిరంగ సభా వేదిక, రెవెన్యూ సదస్సులు జరిగే సభ వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి సహాయ కేంద్రం వంటివి పరిశీలించారు.

సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్పన్ చెలుకల తిరుపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.రాధాబాయి, రుద్రంగి తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఈఈ ఆర్ %డ% బీ వెంకట రమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ శంకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి హైస్కూల్ ను సందర్శించిన రామగుండం ఎంఈఓ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 15 : మండలంలోని పాఠశాలల సందర్శనలో భాగంగా సెక్టార్-2 సింగరేణి ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య గురువారం సందర్శించారు. పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల ఉత్తీర్ణత, మార్కుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి మార్కులు సాధించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించినందుకు ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరుపున పాఠశాలకు తమ సహాయసహకారాలు ఎల్లవేళలా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వి.పూర్ణచందర్ ఉన్నారు.

## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయండి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆయన ఈ పథకం లబ్ధిదారుల ఎంపికపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన, ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, మండలాల వారీగా ఎంపిక ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైనవాటిని బ్యాంకులకు పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బ్యాంకులకు చేరిన దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.







# వలస కార్మికుల పిల్లలకు విజయవంతంగా విద్యా బోధన

- వారిని చదువు వైపు దృష్టి మళ్లించాం
- విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, మే 15 : జిల్లాలోని సుమారు 500 మంది వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేక పాఠశాలల్లో విజయవంతంగా విద్యాబోధన పూర్తి చేయనున్నామని, కార్మికుల పిల్లలందరినీ చదువు వైపు ఆకర్షించామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో వలస కార్మికుల పిల్లలు, ఉపాధ్యాయులు, యజమానులతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలస కార్మికుల పిల్లలు చదువుకు దగ్గర అవ్వాలనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతుల ద్వారా విద్యా బోధన చేయాలని నిర్ణయించామని అన్నారు.

ఎంపిక చేసిన 16 పాఠశాలల్లో సుమారు 500 మంది విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా గత ఫిబ్రవరి మొదటి వారం నుండి బోధిస్తున్నామని అన్నారు. ఇటుక బట్టీ యజమానుల సహకారంతో వీరికి కావలసిన రవాణా సదుపాయం ఏర్పాటు చేశామని, యూనిఫామ్ అందించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరఫున పిల్లలందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించి అవసరమైన వ్యాక్సిన్ ఇప్పించామని అన్నారు. డెంటిస్ట్ ద్వారా వైద్య పరీక్షలు చేయించామని చెప్పారు. ఒరిస్సా కార్మికుల పిల్లల కోసం ఒరిస్సా నుండి పుస్తకాలు తెప్పించి ఇచ్చామని అన్నారు. బ్యాగు స్టేషనరీ, పుస్తకాలు అందజేశామని తెలిపారు. పౌష్టికాహారంతో కూడిన భోజనం అందజేశామని అన్నారు. స్వీయ రక్షణ శిక్షణ కూడా ఇచ్చామని తెలిపారు. వృత్తి నిబద్ధత, అంకితభావంతో ఉపాధ్యాయులు వీరికి చక్కని విద్యా బోధన అందించారని అన్నారు. అందువల్ల పిల్లలకు పాఠశాల పట్ల, విద్య పట్ల ఇష్టం పెరిగిందని తెలిపారు. వీరు భవిష్యత్తులో వారి రాష్ట్రాలకు వెళ్లిన తర్వాత కూడా చదువుపై దృష్టి ఉంచే అవకాశం ఉందని అన్నారు. ఇక్కడ కొద్దికాలంలోనే వారు చక్కటి విద్యను అభ్యసించారని, పూర్తిస్థాయిలో, పూర్తి విద్యా సంవత్సరం చదువు కొనసాగిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యజమానులు, తల్లిదండ్రులు ఈ దిశగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈనెల 24 వరకు తరగతులు ఈ పిల్లలకు కొనసాగుతాయని, చివరి పరీక్ష నిర్వహించి ప్రగతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం యజమానులకు సర్టిఫికెట్ అందజేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. వలస కార్మికుల పాఠశాల పిల్లల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గంగాధర మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, ఇటుక బట్టి యజమానుల సంఘం అధ్యక్షులు హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ను కలిసిన కేంద్ర బృందం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : జిల్లాలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి గురువారం కేంద్రీయ విద్యాలయ దక్షిణ భారత విభాగం డిప్యూటీ కమిషనర్ మంజునాథం, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ, జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్ ను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాసర మండలంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు అవసరమైన స్థలాలను బృందం పరిశీలించిన విషయాన్ని కలెక్టర్కు వివరించారు. వసతి, మౌలిక సదుపాయాలపై చర్చించారు. కేంద్ర విద్యాలయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ సదుపాయాలు, భవిష్యత్ అవసరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## కాల్పుల విరమణతో మోడీ ఇమేజ్ పెరిగిందా..తగ్గిందా!

పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ప్రధాని మోడీ రాజకీయ ఇమేజ్‌ను ప్రభావితం చేసిందా అన్న చర్చ దేశ ప్రజల మధ్య తీవ్రంగా సాగుతోంది. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ దాడులతో ఉగ్రవాద వ్యతిరేక యోధుడుగా ఇమేజ్‌ని సొంతం చేసుకున్న మోడీ ఇప్పుడు ఎందుకిలా చేశారు అనే ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ ఎంతగానో బెదిరిపోయింది. అది అనివార్యంగా చర్చలకు వచ్చేలా చేసింది. అయితే, యుద్ధ క్షేత్రంలో దాయది పై పూర్తిగా పై చేయి సాధించిన భారత్.. మరోమారు అది వికృత చేష్టలకు పాల్పడకుండా ఎలాంటి ఒప్పందాలు లేకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకుంది అనేది ప్రశ్న. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ని భయపెట్టగలిగాము..కానీ అది ఎంత కాలం అనే ప్రశ్న అనివార్యంగా వస్తుంది. ఒకవైపు, కాల్పుల విరమణ.. మరోవైపు పాకిస్తాన్ ఎప్పటిలాగే ఎల్ఓసీ వద్ద తన కుక్కబుద్ధి ప్రదర్శన. అది మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చేసేందుకు అందివచ్చిన అవకాశాన్ని భారత్ ఎందుకు వదులుకుంది? ఏ ఒత్తిడులకు తలొగ్గి కాల్పుల విరమణకు ఒప్పుకుందో ప్రధాని మోడీ ప్రజలకు చెప్పాలంటూ ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం రాజకీయ రాజీగా విమర్శలు ఎదుర్కొంటోంది. అయితే ఈ నిర్ణయం మోడీ దీర్ఘకాల వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందని అధికార వర్గాలు అంటు న్నాయి. కానీ దీనిని అర్థం చేసుకునే స్థితిలో ఇప్పుడు భారత ప్రజలు ఉన్నారా? విమర్శకులు కూడా ఈ నిర్ణయాన్ని మోడీ స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్‌కు ఎదురుదెబ్బగా చూస్తున్నారు. పాకిస్తాన్ బలహీనత, అంతర్జాతీయ ఒత్తిడి ఈ ఒప్పందానికి దారితీశాయ నేది బహిరంగ రహస్యం. ఏదేమైనా, ఆపరేషన్ సిందూర్ తో ప్రధాని మోడీ ఇమేజ్ ఒక్కసారిగా పైకెళ్లి, ఆ తర్వాత ఆయన భక్తులు కూడా ఉస్సూరుమనే పరిస్థితి ఏర్పడిందనేది కళ్లముందు కనిపిస్తున్న నిజం. వారే కాదు, రాజకీయ నాయకులు, విద్యా వేత్తలు, మేధావులు, రక్షణ రంగ నిపుణులు, కళాకారులు, జర్నలిస్టులు ఇలా ప్రతీ ఒక్కరూ తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో ఆత్మరక్షణలో పడిన ప్రధాని మోడీ డ్యామేజీ కంట్రోల్‌కు దిగినట్టు కనిపిస్తోంది. సోమవారం జాతినుద్దేశించి ప్రసంగిం చడం, ఆ మరుసటి రోజే పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'కాల్పుల విరమణ'పై ఆగ్రహంతో ఉన్న వారిని తన ప్రసంగంతో దారికి తెచ్చుకోవాలని ప్రధాని మోడీ ఎంతో ప్రయత్నించారు. భావోద్వేగపూరిత సంభాషణలతో స్పీచ్‌ను కొనసాగించారు. అయితే, ప్రజలు, మేధావులు మోడీ నోటివెంట వినాలనుకొన్నది సెంటిమెంట్ స్పీచ్ కాదు. 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని ఎందుకు, ఏ పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందన్న దానిపైనే అందరి ఆసక్తి నెలకొంది. అయితే, తన ప్రసంగంలో ఆ విషయాన్నే మోడీ దాటవేశారు. 'ట్రంప్ వాణిజ్య బెదిరింపుల వ్యాఖ్యల'పై కూడా ఆయన స్పందించలేదు. దీంతో మోడీ వైఖరిపై అందరూ మండిపడ్డారు. ప్రసంగం నిస్తేజంగా ఓ ప్రహసనంలా సాగిందని ధ్వజమెత్తారు. జాతినుద్దేశించి మాట్లాడటం పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయం కాదని, బాధ్యతల నుంచి ప్రధాని తప్పించుకోలేరని ప్రముఖ జర్నలిస్ట్ రాజు పార్లేకర్ వంటి వారు బహిరంగంగానే విమర్శించారు. 'ట్రంప్ వాణిజ్య వ్యాఖ్యల'పై తన ప్రసంగంలో ఒక్కమాట కూడా ప్రధాని ఎత్తలేదు. అయితే, ప్రసంగం అయ్యాక.. అమెరికాతో చర్చల్లో వాణిజ్యం ప్రస్తావనే రాలేదంటూ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఓ మొక్కుబడి ప్రకటనను విడుదల చేశాయి. దీంతో నెటిజన్లు మరింతగా మండిపడ్డారు. మొత్తంగా తన ప్రసంగం కూడా ప్రభావం చూపలేదని గ్రహించిన ప్రధాని మోడీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించి జవాన్లతో ముచ్చటించారు. పనిలోపనిగా సైనికుల్లో ధైర్యాన్ని నింపేలా ప్రసంగించారు. భారత ఆడపడుచుల సిందూరం తుడిచిన వారి నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశామంటూ మాట్లాడారు. భారత్‌ను, ప్రజలను రక్షించుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయమైనా తీసుకొంటామన్నారు. ఐతే, ఈ పర్యటన కూడా బెడిసికొట్టినట్టే కనిపిస్తోంది. జవాన్లతో మోడీ చేసిన వ్యాఖ్యలపై కూడా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. 'పహల్గాం మహిళల సిందూరాన్ని దూరం చేసిన ఉగ్రవాదులను, వారిని ఎగదోసిన పాక్‌ను విడిచి పెట్టడమేనా మీరు చెప్తున్న ఆ పెద్ద నిర్ణయం' అంటూ నెటిజన్లు మోడీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎద్దేవా చేస్తున్నారు. యుద్ధానికి ముందు లేదా యుద్ధం జరుగుతున్నప్పుడు నాయకుడు అనే వాడు సైన్యంలో ధైర్యాన్ని నూరిపోయడం చూశాంగానీ, యుద్ధం పూర్తయ్యాక వెళ్లడమేంటని మోడీని ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. లైవ్ స్ట్రీమింగ్, యూట్యూబ్, ఎఫ్‌బీ, ఎక్స్ లైవ్ వీడియోల్లో మోడీ ప్రసంగాల కు వ్యూయర్‌షిప్ భారీగా తగ్గింది. మరోవైపు, 'కాల్పుల విరమణ' నిర్ణయంపై నెటిజన్లు మోడీ సర్కారుపై విమర్శలు చేయడం... ఇంతలో 'మాదే విజయమ'ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించటం జరిగిపోయాయి. పాక్ సైనికులు మిఠాయిలు పంచుకొంటూ సంబురాలు చేసు కొన్న వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో మోడీ ప్రభు త్వంపై విమర్శల తీవ్రత మరింత పెరిగింది. ఇంటా బయటా ముప్పేట దాడి పెరుగుతుండటం, ఇంతలోనే 'కాల్పుల విరమణ' నిర్ణయా న్ని పక్కనబెట్టి సరిహద్దుల్లో పాక్ మళ్లీ డ్రోన్ల దాడులతో కవ్వింపులకు పాల్పడుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరి అయ్యింది. డ్యామేజీ కంట్రోల్ చేసుకోకుంటే పరిస్థితి చేజారే ప్రమాదమున్నదని గ్రహించిన ప్రధాని మోడీ జాతినుద్దేశించి ప్రసంగించారు. అయితే, అంతకు ముందే లైన్‌లోని వచ్చిన ట్రంప్.. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించడంతోనే భారత్-పాక్ కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయని బాంబు పేల్చారు. దీంతో మోడీ సర్కారు తీవ్ర ఇరకాటంలో పడింది. మొత్తంగా 'కాల్పుల విరమణ' ప్రకటన, దాని తదనంతర పరిణామాలపై ప్రధాని మోడీ ఆత్మరక్షణలో పడి ఇమేజ్ మేకోవర్ కోసం ప్రయత్నిస్తు న్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయని చెప్తున్నారు. రాబోవు రోజులలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# కంచె గచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

### - యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు - భూములపై మరోమారు విచారించిన సుప్రీం

### - విచారణ జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 15 : హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంవపర్డ్ కమిటీ హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షిం చబోమని హెచ్చరించింది.










# ప్రపంచ సుందరిమణులు ఫిదా...

- అపూర్వ ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం
- గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య ప్రదర్శనలతో కళాకారుల స్వాగతం
- ఆలయంలో శిల్పకళను చూసి తన్మయత్వం
- భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చీరలు ధరించి..
- నుదుట కుంకుమ బొట్టుతో సందడి
- ఆలయంలో ప్రత్యేక పూజలు.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..
- రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సిరిసిల్ల రాజయ్య





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 15 : కరేజ్, కాంపాసన్, కమిట్‌మెంట్‌తో మహిళలు ముందుకు సాగాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. వరల్డ్ హెరిటేజ్ దేవాలయంగా యునెస్కో వారిచే గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని బుధవారం 35 దేశాలకు చెందిన ప్రతినిధులతో కూడిన ప్రపంచ సుందరీమణుల టీమ్ సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, డాక్టర్ ఎస్పీ శబరిష్, జిల్లా అధికారులు, టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరీమణుల బృందానికి గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శన ద్వారా ఆత్మీయ ఘన స్వాగతం పలికారు. దేవాలయంలోకి చేరుకున్న సుందరీమణుల ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయ తీరుతన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు. తెలుగుదనం ఉట్టిపడేలా పట్టుచీర ,పట్టు పరికిణిలు కట్టుకొని తిలకం దిద్దుకొని అచ్చం తెలంగాణ అమ్మాయిల లాగా రామప్ప ఆలయం ప్రపంచ సుందరిమణులు సందర్శించారు. ఆలయానికి సంబంధించిన చిత్రాలను సెల్ ఫోన్ లలో ఫోటోలు తీసుకున్నారు. ప్రపంచ సుందరిమణుల పర్యటన సజావుగా జరిగేలా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అనంతరం రామప్ప ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్ద తెలంగాణ సాహిత్య అకాడమీ మరియు భాషా సాంస్కృతిక శాఖ వారి రాణి రుద్రమదేవి వేషధారణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజరి ఆధ్వర్యంలో కాకతీయ రాజుల పరిపాలన చారిత్రాత్మక అంశాలను నృత్య రూపం, రంజిత్ పేరణి నృత్య కళా బృందం వారిచే పేరణి నృత్యం, 65 మంది పేరణి కళాకారులతో సత్యం శివం సుందరం శివతాండవం, లైట్స్ , సౌండ్ షో ప్రదర్శించారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ... సాంస్కృతిక చారిత్రక కట్టడాలకు నిలయం ములుగు ప్రాంతమని, ఇక్కడికి ప్రపంచ సుందరిమణుల పోటీల కోసం 35 దేశాల నుంచి విచ్చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రకృతితో కలిసిపోయి శతాబ్దాల పాటు జీవించిన గిరిజనుల జీవన విధానం, ఆత్మగౌరవం స్వాతంత్రం కోసం రాజులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ్మక్క సారలమ్మ ధీరత్వం నిదర్శనం ములుగు జిల్లా అని అన్నారు.మహిళలు ధైర్యవంతులు శక్తివంతులని సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమదేవి నిరూపించారని తెలిపారు. నేడు మంత్రిగా మాత్రమే కాకుండా ఈ ప్రాంత బిడ్డగా ఈ వేడుకకు హాజరు కావడం సంతోషంగా ఉందని, అందం అనేది కేవలం బాహ్యంగా కనిపించేది కాదని, నిజమైన అందం మనసు లోపల ఉంటుందని, ఇతరుల అభివృద్ధి చేయడంలో దాగి ఉంటుందని అన్నారు. ములుగు ప్రాంతం సృజనాత్మకతకు, దైవత్వానికి కేంద్రంగా ఉంటుందని, యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప ఆలయం 13వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారని, ఈ ప్రాంత ఔన్నత్యం గొప్పతనానికి ప్రత్యేకగా ఈ నిర్మాణం నిలుస్తుందని అన్నారు. పూర్వీకులైన కాకతీయ రాజులు టెంపుల్ టౌన్స్ , ట్యాంక్ నిర్మాణం చేశారని , అదే విధంగా నేడు మహిళలు కరేజ్, కాంపాసన్ , కమిట్ మెంట్ పెంచుకోవాలని, దీని ద్వారా మన వ్యక్తిత్వం తో పాటు సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు, ప్రపంచ సుందరిమణుల పోటీల్లో పాల్గొనే మహిళలందరికీ ములుగు ప్రాంత ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ సుందరి మనలను డయాస్ మీదికి ఆహ్వానించి గౌరవ సూచీకంగా ఘనంగా సత్కరించారు.

అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో రచించి ముద్రించబడిన కాకతీయుల కళా వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.













# రాజీవ్ యువ వికాసంలో సిబిల్ స్కోర్ తీసేయాలి

## - తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 15 : తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాస పథకంలో సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల డిమాండ్ చేశారు. గురువారం గార్ల మండల కేంద్రంలోని విశ్వ న్యాయవాద కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశ్వ మాట్లాడుతూ నిరుద్యోగ యువత యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక విధాలుగా మానసిక క్షోభకు గురవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించి నిరుద్యోగ యువతీ యువకులకు 4 లక్షలలో సబ్సిడీపై రుణం ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. అదే సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిబిల్ స్కోర్ ప్రతిపాదికన రుణాలు మంజూరు చేయాలని ప్రకటించడం ఆస్పాస్పదమన్నారు. సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడం వల్ల 80 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకుల ఉపాధి అవకాశాలను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిబిల్ స్కోర్ ప్రతిపాదికన రుణాలు ఇవ్వాలని ప్రకటించడం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సిబిల్ స్కోర్ లేదని ప్రకటించడం ప్రభుత్వ ద్వంద విధానాలకు అద్దం పడుతుందన్నారు. ముఖ్యమంత్రి ఒక తీరు, ఉప ముఖ్యమంత్రి మరో తీరు ప్రకటించడం పట్ల నిరుద్యోగ యువత యువకులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాస పథకంలో అవినీతి అక్రమాలకు రాజకీయ జోక్యానికి తావు లేకుండా పారదర్శకతతో వ్యవహరిస్తూ అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు మంజూరు చేయాలని విశ్వ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేస్తూ సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేసి నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు మంజూరు చేయాలని విశ్వ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు టిఆర్ఎస్ మండల నాయకులు ముంగి రాములు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మాగం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ రద్దుకై పోరాడుదాం

## - మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : బిజెపి మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మె ప్రచారంలో భాగంగా ఆర్జీ టూ డివిజన్ పరిధిలోని ఓసిపి-3 కృషి భవన్ వద్ద సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కుల నారాయణ అధ్యక్షత వహించగా ఇఫ్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ, ఎచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు దావు రమేష్, టిఎస్‌యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమార్, ఏఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి రాములు, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు ఏడుకొండలు మాట్లాడుతూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాలను కార్పోరేట్ సంస్థలకు పణంగా పెడుతుందన్నారు. శ్రామిక వర్గ శ్రమ శక్తిని కారు చౌకగా దోచుకోవడానికి మరిన్ని అదనపు లాభాలను పోగేసుకోవడానికి పని గంటల భారాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం 29 రకాల చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. వాటి అమలుకు తుందని లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మిక వర్గం యూనియన్లు ఏర్పాటు చేసుకోవడానికి సమ్మెలు చేయడానికి కష్టతరంగా ఉంటుందన్నారు. కార్మిక వర్గ సంక్షేమం వారి హక్కులు సౌకర్యాలు యాజమాన్యం దయ దక్షిణాలపై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఈ కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించుటకు కార్మిక హక్కులను కాపాడుకొనుటకు పరిశ్రమల రక్షణకై దేశవ్యాప్త దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఈ నరేష్, బి.అశోక్, బి.సంతోష్,ఐ రాజేశం, ఎస్.ప్రసాద్, బీరయ్య, దుర్గం పోచయ్య, సదానందం, ఎస్ రవీందర్, రాజనర్సు, మహేందర్, కాంపల్లి మల్లేశం, రాజబాబు, స్వామి. తదితరులు పాల్గొన్నారు.



# శంకరన్నామీరు త్వరగా కోలుకోవాలి

## - ఎమ్మెల్యే రాజన్న అండగా ఉన్నాడు
## - అధైర్య పడవద్దు అందరం ఉన్నాం
## - మనాలి ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 14 : కాంగ్రెస్ పార్టీకి ఈ గ్రామంలో ఊపిరివి నీవు అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలి, కోలుకుంటావు రామగుండం ఎమ్మెల్యే రాజన్న నీకు అండగా ఉన్నాడు మేమంతా ఉన్నాం అధైర్య పడవద్దు అంటూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మక్కాన్సింగ్ సేవా సమితి చైర్మ న్ మనాలిఠాకూర్ అన్నారు గురువారం పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీపతి శంకరయ్యను పరమార్శించి మనోధైర్యాన్ని అందించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజన్నకు నీవు వెన్నంటి ఉంటావని అందుకే నీవు త్వరగా కోలుకొని మళ్ళీ రానున్న పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేందుకు ఆ దేవుడు నీకు మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తాడనే పూర్తి విశ్వాసం మాకు ఉందని శంకరన్న నీ ధైర్యమే నీకు శ్రీరామరక్షగా రాజన్న అనుచరునిగా మాకు తోడుగా నడుస్తావని ఆశిస్తున్నానని మనాలి ఠాకూర్ మానసిక ధైర్యాన్ని అందించారు.



# రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అటవీశాఖతో ఉన్న భూ వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి మండలానికి సంబంధించిన భూముల వివరాలతో సమగ్ర ప్రొఫైల్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో ప్రస్తుతం ఉన్న భూ సమస్యల పరిష్కార దశలను కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వండి

## - టిజెయు మోటకొండూరు మండల అధ్యక్షులు గట్టికొప్పుల శ్రీనివాస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాస పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ మోటకొండూరు మండల అధ్యక్షులు గట్టికొప్పుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కలం కార్మికుల్లాగా రోజువారి వేతనం లేకుండా ప్రజా సంక్షేమ ధ్యేయంగా, ప్రజల సమస్యలను వెలికితీస్తూ, తమ వృత్తిని ప్రాధాన్యతగా తీసుకొని రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మంథని లింగయ్యకు నివాళులు అర్పించిన ఏఐటియుసి నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : రామగుండం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు మంథని లింగయ్య అకాల మరణం విషయం తెలిసిన ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ లు గురువారం అతని ఇంటికి వెళ్ళి పార్థీవ దేహం పై అరుణ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లింగయ్య చనిపోవడం కార్మిక వర్గానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరపున లింగయ్య మృతి పట్ల జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి,సంతాపం వ్యక్తం చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రొడ్డ శంకర్, ఆర్.రాజేందర్, స్వరూప, సదయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# శ్రీనివాస్ గౌడ్‌ను గౌడ సంఘాల నేతల పరమార్శ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 14 : అంతర్గం మండలం గోలివాడ గ్రామంలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాపాయ అంచుల వరకు చేరి ఆసుపత్రిలో చికిత్స పొంది గురువారం స్వగృహానికి రాగా సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఫౌండర్ సింగం సత్తయ్య గౌడ్, రాష్ట్ర గౌరవ సలహాదారు కోలా లక్ష్మణ్ గౌడ్, రామగుండం నియోజకవర్గ కన్వీనర్ మాజీ ఎంపిటిసికోల రాజేశ్వరి రామ్మూర్తి గౌడ్‌లు పరామర్శించారు. అనంతరం సత్తయ్య గౌడ్ సెల్ఫోన్ ద్వారా ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శ్రీనివాస్ గౌడ్ తగిన ఎక్స్గ్రేషియా వెంటనే అందించేలా చూడాలని కోరారు. అదేవిధంగా బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మన సంఘం ద్వారా త్వరగా వచ్చేలా చూస్తామని సింగం సత్తయ్య గౌడ్, కోల లక్ష్మణ్ గౌడ్, సంఘం కన్వీనర్ మాజీ ఎంపీటీసీ కోల రాజేశ్వరి రామ్మూర్తి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ కు భరోసా కల్పించారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

## - పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ
## - ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం లాంటిదని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 43 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20,47,000/- ఇరవై లక్షల నలబై ఏడు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి బాధిత కుటుంబాలకి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని, దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని, మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, సాంబశివరావు, మంత్రిప్రగడ సత్యనారాయణ,పోతుల రాజేందర్, ఇబ్రహీం, కావూరి అనిల్, నాగేశ్వరరావు, మోజేశ్, ఇజ్రాయిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపల్ కార్మిక నాయకుడు మంతెన లింగయ్య అనారోగ్యంతో మృతి

## - నివాళులు అర్పించిన పలువురు నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య, గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు.గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన మంతెన లింగయ్య కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. గురువారం ఉదయం అకాల మరణం పొందాడు. రామగుం డం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శిగా 40 సంవత్సరాలు కార్మికుల సమస్యల పరిష్కారంకు అయన కృషి చేసాడు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం లో రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన దళిత సమస్యల పట్ల కూడా ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాడు.ఆయన మృతి పట్ల రామగుండం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, నడిపెల్లి మురళీధర్ రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య, బిజెపి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి కందుల సంధ్యారాణి, సీనియర్ హైకోర్టు అడ్వకేట్, గొర్రె రమేష్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ ఏఐటీయూసీ నాయకులు, కందుకూరి రాజారత్నం, ఎంఏ గౌస్, మద్దెల దినేష్, పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు, మంతెన లింగయ్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు దళిత బహుజన జాతికి చేసిన సేవలను స్మరించారు. నివాళులు అర్పించిన వారిలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపెల్లి జిల్లా కో కన్వీనర్లు, ఆకునూరి బాల అంకుష్, గద్దల శశిభూషణ్, తదితరులు ఉన్నారు.





# రాంటేక్‌లో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 15 : గ్రామభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముధోల్ మండలంలోని రాంటేక్ గ్రామంలో శివాలయ సమీపంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామఅభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో కళ్యాణమండపం నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి 24 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అదే విధంగా మండపం, షెడ్డు కోసం ఐదులక్షల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు చెప్పారు. తక్షణమే ఆలయం వద్ద బోరు బావి వేయిస్తానన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లు అందించేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను గ్రామస్తులు ఘనంగా స్వాగతించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్సాగౌడ్, మాజీ జడ్పీటీసీ సి.సంప్లీ రమేష్, నాయకులు తాటివార్ రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, శ్యామ్రావ్, భుజంగ్, తదితరులు ఉన్నారు.




# మండుటెండలో ఉపాధి హామీ కూలీలతో మనాలి ఠాకూర్

## - కూలీల కష్టాల పై ఆరా - పిల్లల చదువులెట్లా ఉన్నాయి - మంచి చదువులు చదివిద్దాం - మేము ఉన్నాం తోడుగా నీడగా - మనాలి ఠాకూర్

(కోల లక్ష్మణ్ - ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం మే 14 : భగభగ మండే సూర్యుడు ఎర్రటి దగడుతో నిప్పుల కొంపటి వేడిమిని లెక్క చేయకుండా మిట్ట మధ్యాహ్నం చేను చిలుకలు గుట్టలు చెట్లు చేమల్లో కడుపు తిప్పల కోసం ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలను కలిసి వారి వారి కష్టాల కన్నీళ్లను స్వయంగా తెలుసుకోవాలనే తపనతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజు ఠాగూర్ సతీమణి మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ గురువారం పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మమేకమైన తీరు ఉపాధి హామీ కూలీలనే కాకుండా మండలములోని పల్లెల్లోని ప్రజలను ఆత్మీయులుగా మార్చుతుం. ఇన్నేళ్ల చరిత్రలో ఎవరు ఎమ్మెల్యేగా గెలిచిన వారి వారి కార్యక్రమాలలో గ్రామాలకు వచ్చి వెళ్లిపోవడం తప్ప పనిచేసే స్థలాల్లో పనిచేసే రైతు కూలీలను ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి కష్టాల కన్నీళ్లను కదిలించిన దాఖలాలు లేవు.. అయితే రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ సతీమణి మనాలి ఠాకూర్ గత 20 సంవత్సరాలుగా రామగుండం నియోజకవర్గంలో పతి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వెన్నంటి ఉంటూ ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో గడప గడప తిరుగుతూ రాజ్ ఠాకూర్ విజయం కోసం శ్రమించారు.

నిన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అఖండ విజయం సాధించడంతో అతని సతీమణి మనాలి ఠాకూర్ తన ఇంటికి పరిమితం కాలేదు రామగుండం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన రామగుండం ప్రజలకు అన్ని రకాల సేవలను అందించాలనే లక్ష్యం తపనతో ప్రజల మధ్య తిరగాలనే నిర్ణయాన్ని తీసుకోవడం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లయింది. మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్‌గా వ్యవహరిస్తూ మనాలి ఠాకూర్ రామగుండం నియోజకవర్గంలోని ప్రతి గల్లీ ప్రతి ఇంటి గడప గడపకు వెళుతూ ప్రజా సమస్యలను కష్టాల కన్నీళ్లను వారి ఆపదలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తన పతి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ కు అందిస్తూ ప్రజల అవసరాలను సమస్యలను పరిష్కరించే వారధిగా మనలిఠాకూర్ జనంలో నిలిచారు. నిరంతరం జనంలోనే తిరగడంతో ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పరిపాల పరమైన బాధ్యతలు అసెంబ్లీ సమావేశాలు రామగుండం నియోజక వర్గానికి కావాల్సిన అభివృద్ధి నిధులు నూతన పరిశ్రమల ఏర్పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన అభివృద్ధి పథకాలు ప్రజల సంక్షేమం కోసం పనులలో నిమగ్నమై ఉన్న ప్పటికీ మనాలి ఠాగూర్ నియోజకవర్గ ప్రజలను నేరుగా కలుస్తూ సెల్ ఫోన్‌ద్వారా వారి సమస్యలను వింటూ, బాధ్యతగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు సమాచారం అందిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజల మధ్య ఉన్నట్లుగానే అనుసరిస్తున్న తీరు ఇతర నియోజకవర్గాల్లో ప్రజలను ఆకట్టుకుంటుంది. ఎమ్మెల్యే సతీమణి ఇద్దరు సమంగా బాధ్యతగా ప్రజా సమస్యల్లో నిమగ్నమై ప్రజలే ఇల్లు ప్రజలే కుటుంబాలను తమ కుటుంబాలుగా భావిస్తూ అనుసరిస్తున్న నూతన విధానం రామగుండం నియోజకవర్గంలో రాజకీయరంగంలో నూతన అధ్యాయానికి తెర లేపింది, లేపుతుందనేది విశ్లేషకులు అంటున్న అభిప్రాయాలు. అందులో భాగంగానే ప్రజల కోసమే తామున్నామని ప్రకటించుకుంటున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ గురువారం కుక్కల గూడూరు ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ఎండ వేడిమి దగడు తగ్గించేందుకు గ్లూకోస్ వాటర్ ప్రతి ఒక్కరికి అందించి చెట్ల నీడలో సేద తీర్చారు. అనంతరం వారి వారి పిల్లలు ఏ ఏ పాఠశాలల్లో చదువుతున్నారు పాఠశాలల వివరాలు అడిగి తెలుసుకున్నారు మంచి పాఠశాలల్లో మన పిల్లల్ని చేర్పిద్దాం వారికి మంచి చదువులు చెప్పించి ప్రయోజకులుగా తయారు చేద్దాం అందుకు మన ఎమ్మెల్యే రాజన్న మీ ఆడబిడ్డను మీ ఇంటి బిడ్డను నేనున్నాను అంటూ మనాలి ఠాకూర్ ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు భరోసాను అందించారు. అంతేకాకుండా ఏ పల్లెలోనైనా ఏ ఇంట్లోనైనా ఎలాంటి ఆపద ఉన్న తమకు సమాచారం అందించాలని అందుకు మన పార్టీ కార్యకర్తలు ఉన్నారు, వారి దృష్టికి కూడా తేవాలని అదేవిధంగా పార్టీ కార్యకర్తలు పార్టీ బాధ్యతలతో పాటు ప్రతి ఇంటి యోగక్షేమాలను ఆరోగ్యాలను కాపాడేందుకు సంక్షేమ పథకాలు అందించిన మాదిరిగానే మనం ఆరోగ్య సేవలను అందించేందుకు నిరంతరం అలర్ట్‌గా ఉండాలని మనాలి ఠాగూర్ ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్యే సతీమణి అయినప్పటికీ ఎలాంటి దర్పానికి పోకుండా మండుటెండలో మన వద్దకు వచ్చి మనకు మంచి చేసే ముచ్చట్లు చెప్పిన మీ అసొంటి బిడ్డలను మనసునిండా గుండెల్లో పెట్టుకొని కాపాడుతామని పల్లెలన్నీ మీ కుటుంబమని మీరే మా మంచి చెడ్డలకు ఆపదలకు అండగా నిలిచే నేస్తాలంటూ ఉపాధిహామీ కూలీలు అనడం కోస మెరుపు.



# మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

## - ఇఫ్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ - డిజిఎం పర్సనల్ మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు సమ్మెను పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ వన్ ఏరియా డీజీఎం పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబుకు గురువారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీ యు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ, ఎస్‌సిసిడబ్ల్యూయు (ఐఎఫ్ టీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్నలు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా వేలం వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా ఆస్తులను కారుచౌకగా కార్పోరేట్లకు దారా దత్తం చేస్తున్నారని ఆరోపించారు. లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా 24 శాతం నుండి శాతం వరకు అమ్మే పనిలో నిమగ్నమై ఉన్నారని అన్నారు. దేశ సంపదను సహజ వనరులను ఇతర ప్రజా ఆస్తులను కాపాడాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ తదితర డిమాండ్ల సాధనకు మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అంత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు ఈ నరేష్, బి అశోక్, ఐ రాజేశం, ఎం కొమరయ్య, సదానందం. తదితరులు పాల్గొన్నారు.




# మే 20న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో కాంట్రాక్టు కార్మికులందరు పాల్గొనాలి

## - కాంట్రాక్టు కార్మికుల జెఎసి నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కోరుతూ మే 20న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అందరు పాల్గొనాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి నాయకులు నాయకులు పిలుపునిచ్చారు. అర్జీవన్ ఏరియాలోని పలు కాంట్రాక్టు కార్మికుల అడ్డాలపై జెఎసి నాయకులు గురువారం దేశవ్యాప్త సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికుల హక్కులను మోడీ సన్నిహితులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి మోడీ అనుచరులకు అనుకూలంగా మార్చడం జరిగిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులు యజమానులకు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. పని గంటలు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లాంటి అనేక హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నదన్నారు. కార్మికులు అడ్డా కూలీలుగా మారే అవకాశం ఉందన్నారు. ఉపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు అందరు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మేదరి సారయ్య, తోకల రమేష్, విశ్వనాథ్,మద్దెల శ్రీనివాస్,రత్న కుమార్, ఉపేందర్,రాజు,రవి, శ్రీనివాస్, కిరణ్, రాములు, రాజేందర్, మదు, మహేందర్‌లతోపాటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# పదోన్నతి అనేది ఉద్యోగ జీవితంలో అపూర్వ ఘట్టం

## - ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మే 15 : ప్రతి ఉద్యోగికి జీవితంలో పదోన్నతి రావడం అనేది అపూర్వ ఘట్టమని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. అలాగే పదోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయని అన్నారు. గురువారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ఏఆర్ కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి పొందుతున్న 7 మంది అధికారులను పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి భుజాలకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన అధికారులు ఎన్.కిషన్ రావు, ఎం.అశోక్, జే.దుదిరామ్, ఆర్.గోవింద్, ఎల్.దినేష్, ఎన్.అరవింద్,ఆర్ రామారావు ఉన్నారు. వీరందరికీ జిల్లా ఎస్ పీ పదోన్నతి పొందిన శుభ సంతోషం సమయంలో శుభాకాంక్షలు తెలియజేశారు. వీరందరికీ జోన్ పరిధిలో ఉన్న నిర్మల్ మరియు జగిత్యాల జిల్లాలలో ఖాళీలను బట్టి బదిలీలు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, సీసీ కొండరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ,ఎస్టీ భూములు ఆక్రమిస్తే సహించేదిలేదు

## - విశారదన్ మహారాజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మే 15 : ఎస్సీ ఎస్టీ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఎవరిని ఉపేక్షించేది లేదని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా సొనాల మండల కేంద్రంలోని దళితుల స్మశాన వాటిక బౌద్ధ విహార ప్రాంత భూమినీ సందర్శించి మాట్లాడారు. సొనాలలో దళితుల భూమిపై ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆ గ్రామంలో దళితులపై ఉన్న భూ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు భూముల విలువలు పెరగగానే సంక్షేమ కార్యక్రమాల పేరుతో ప్రభుత్వ భవనాల పేరుతో మాల మాదిగల మహర్ ల భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. ఈ సమస్య అదిలాబాద్ జిల్లాలోని కాదు తెలంగాణ వ్యాప్తంగా దళితుల భూములను ప్రభుత్వం దౌర్జన్యంగా లాక్కుంటుందని దీనిపై భారీ భూ పోరాటం చేస్తామన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీల భూముల రక్షణ కోసం విద్యా వైద్యం ఉపాధి భూమిని సాధించడం కోసం లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర చేపట్టినట్లుగా వివరించారు. అన్ని రంగాల్లో అశ్రద్ధ చేస్తున్న ప్రభుత్వాన్ని దోషిగా చూపించడమే కాకుండా ఈ జిల్లా ప్రజలకు అందాల్సిన వాటా వివిధ రంగాల్లో సంక్షేమ బడ్జెట్ అందే విధంగా మాభూమి రథయాత్ర ద్వారా ప్రశ్నించడమే కాకుండా పోరాటం చేస్తుందన్నారు. 10% లేని రెడ్డి వెలుమల రాజ్యం ఇక మనకవసరం లేదని మన బీసీ ఎస్సీ ఎస్టీలను అధిగారణకి తీసుకురావడానికి చేయాలన్నారు. అనంతరం సోనాల శివాజీ చౌక్ లో ఏర్పాటు చేసిన వారిరోడ్ షోలో మాట్లాడారు.బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీలోకి సబ్బండ కులాలు రావాలని తెలంగాణ బీసీ ఎస్సీఎస్టీల రాజ్యసాధనకోసమే జేఏసీ ఏర్పాటు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ సొనాల మండల అధ్యక్షులు కొండ మడుగు గణేష్, ఇచ్చోడ మండల నాయకులు శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, చింటూ, నరేష్ రాకేష్ వివిధ కులాల నాయకులు పాల్గొన్నారు.




# వేసవి శిబిరాలలో నేర్పించిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 15 : విద్యార్థుల కొరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలలో నేర్పించిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో 15 రోజులపాటు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించిందని తెలిపారు. విద్యార్థులు వేసవి కాలంలో ఇంట్లో ఎక్కువ సమయం గడపడంతో టివి, మొబైల్‌లతో సమయం వృధా చేసుకుంటున్నారని ప్రభుత్వం వేసవి శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులు, వాలంటీర్లు నేర్పించిన అంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, ఆటలు, బొమ్మలు వేయడం, సంగీతం నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఆటలు ఆడడంతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, విద్యార్థులు శిబిరంలో నేర్చుకున్న అంశాలను కొనసాగించాలని తెలిపారు. శిబిరంలో నేర్పించిన అంశాలపై పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాలు సాధించే విద్యార్థులకు సన్మానంతో పాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు వేసవి శిబిరం సమన్వయకర్త ఉప్పులేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల కోసం డే కేర్ సెంటర్ల ఏర్పాటు హర్షనీయం

## - సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, మే 15 : రాష్ట్రంలో వృద్ధుల కోసం ప్రతీ జిల్లాలో ఒక డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షనీయమని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. ఒంటరితనం, ఆరోగ్యంతో ఇబ్బంది పడుతున్న వృద్ధులకు డే కేర్ సెంటర్ల ద్వారా వారి చివరి క్షణం వరకు తోడు, నీడ దొరుకుతుందన్నారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిది లక్షల మంది సీనియర్ సిటిజన్స్ కు మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ స్వాగతిస్తుందన్నారు.






# 'మెగా జాబ్ మేళా' ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ రమేష్, జిఎం లలిత్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మే 18న ఆదివారం 'మెగా జాబ్ మేళా'ను సింగరేణి జవహర్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గోదావరిఖని స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, అర్జివన్ జియం డి.లలిత్ కుమార్‌లు పోలీస్, సింగరేణి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ జాబ్ మేళాకు హాజరు కానున్న నిరుద్యోగ యువతి యువకులకు సరిపడు షామియానాలు, చల్లదనం కొరకు కూలర్స్, త్రాగు నీరు, హెల్ప్ డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కొరకు ప్రత్యేక స్టాల్స్, స్టేజి ఏర్పాట్లు, అభ్యర్థుల ఎంట్రీ, ఎగ్జిట్ దారుల గురుంచి, పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు పై అధికారులతో చర్చించారు.

# కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

## - జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, మే 15 : 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ తో పాటు ఎంసెట్ కోచింగ్ (కార్పొరేట్) ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివి 10వ తరగతి వార్షిక పరీక్షలలో 7 జిపిఎ ఆపై ఫలితాలు సాధించిన షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఈబిసి, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ లోగా ఆన్లైన్లో www.telanganaepass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతిలో మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు,వెనుకబడినతరగతులు,ఈబిసి, మైనారిటీ,దివ్యాంగ విద్యార్థులకు ప్రవేశం కల్పించబడుతుందని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# బోథ్ నియోజకవర్గ స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఇస్తాం

## - రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హంధాన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మే 15 : ఆదిలాబాద్ జిల్లాలో బోథ్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకత్వ నిర్మాణంలో గుర్తింపు కలిగిన స్థానాన్ని ఇస్తామని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హంధాన్ పేర్కొన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బోథ్, సోనాల, బజార్హత్నూర్, నేరడిగొండ మండలాలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హంధాన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతల్లో ఉన్నప్పుడు బోథ్ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపుని ఇచ్చారని, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన అధికారంలో ఉండడం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సాహంగా ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే ధ్యేయంగా బుత్ స్థాయిలో బలపడాలని పిలుపునిచ్చారు. మే 30వ తారీకు వరకు ఆదిలాబాద్ జిల్లాకు అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులను ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గత వేదికల మీద సమస్యలు పరిష్కరించుకోవాలి బహిరంగంగా ఎవరైనా మాట్లాడితే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశీలకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ ఆడ్డి బోజ రెడ్డి, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరాంచు శ్రీకాంత్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జంగాల భోజన్న, బోథ్, సోనాల, బజార్హత్నూర్ నేరడిగొండ మండలాల అధ్యక్షులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెదేపా మండల కార్యవర్గ నియామకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ధర్మపురి, మే 15 : ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎండపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు గా రాయంచు సదాశివ్, ఉపాధ్యక్షులు గా సముద్రాల రమేష్ గుప్తా, రాయంచు విజయ, ప్రధాన కార్యదర్శిగా పెసరు స్వామి, కార్యనిర్వాహక కార్యదర్శులు గా గర్వందుల మల్లేశం, గోల్లే రాజయ్య, పెసరు కవిత, పెసరు రాజయ్య, మడప సత్యనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరిశీలకులుగా పెద్దపెల్లి సత్యనారాయణ,అక్కపాక తిరుపతి ,ఓరుగంటి భార్గవ్ రాం, బత్తుల ప్రదీప్, బానోతు రాజేష్ లు పాల్గొన్నారు.అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సదాశివ్‌ను శాలువాతో సత్కరించారు.


# నేడు జిల్లాకు రాష్ట్ర మంత్రి

## - పిఎ టు రాష్ట్ర మంత్రి పి.వెంకట్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే15 : ఈ నెల 16న జిల్లాకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రానున్నారని పి.ఎ. టు రాష్ట్ర మంత్రి పి. వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12:45 గంటలకు జిల్లాలోని పెంచికల్పేట్ మండల కేంద్రానికి హెలిప్యాడ్ ద్వారా చేరుకుంటారని, మధ్యాహ్నం 1 గంటలకు పెంచికల్ పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.



# అనాధ పిల్లలకు అన్నదానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 15 : సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్ తల్లి పోచమ్మ ఏడవ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎండిహెచ్‌డబ్ల్యు అనాథ ఆశ్రమంలోని పిల్లలకు పోచమ్మ కుటుంబ సభ్యులు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పూర్వ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, నగర కార్యవర్గ సభ్యులు తాళ్ళపెల్లి మల్లయ్య, తొడుపునూరి రమేశ్ కుమార్, మడికొండ ఓదేమ్మ మార్కపూరి సూర్య, ఆశ్రమ నిర్వాహకులు రాజయ్య తో పాటు పోచమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల, మే 15 : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి పోలీసు, రవాణా, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్) లను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తెలుసుకొని ఉండాలని, మూల మలుపులు, వేగనిరోధకాలు, వేగ పరిమితి, యు టర్న్, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారుల మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రమాదాల నియంత్రణలో భాగంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని బోయపల్లి రోడ్ నుండి తాండూర్ వరకు, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుండి హనుమాన్ విగ్రహం వరకు, నస్పూర్ లోని కృష్ణకాలనీ నుండి దొరగారిపల్లె వరకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని, లక్సెట్టిపేటలోని ఆంధ్రబోర్ నుండి ఉత్కూర్ చౌరస్తా వరకు, కోటపల్లి మండలంలో, జన్నారం మండలంలో చింతగూడ, పొనకల్, బస్టాండ్ ప్రాంతాలలో, ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి ప్రమాదాల నివారణలో భాగంగా లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తా నుండి మేదరివాడ, టిటిడి కళ్యాణమండపం, రైల్వేస్టేషన్, లక్ష్మిటాకీస్ చౌరస్తాలలో సిగ్నల్స్, రేడియమ్స్ ఏర్పాటు చేయాలని, వారానికి ఒకరోజు వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టాలని, జిల్లాలోని ప్రతి వైన్స్, బార్, రెస్టారెంట్ల వద్ద పార్కింగ్ స్థలము ఉండేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ ఏరియాలో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణ, సూచిక బోర్డులు, రేడియమ్స్, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో అవసరమైన అటవీ అనుమతులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ పనుల వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి

## - రీజినల్ రింగ్ రోడ్‌కు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 15 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ పనుల ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు సంబంధించిన అంశాలపై గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.భూములు అందించిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి అని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. నష్టపరిహారం చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలి. ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన అవసరం అన్నారు. సర్వే ప్రక్రియ నుంచి పరిహార చెల్లింపుల వరకు ప్రతీ దశలో అధికారుల బాధ్యత అన్నారు.రైతుల నుండి స్వచ్ఛందంగా భూములు సేకరించేలా అవగాహన కల్పించాలన్నారు.పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలన్నారు.భూములను అందిం చిన రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రైతుల భూమికి తగినంత నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. వాస్తవిక మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం నిర్ణయించాలన్నారు. అదనపు కలెక్టర్లు, ఆర్‌డీఓలు సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి రైతుల్లో అభిప్రాయ బేధాలు, సర్వేలో సాంకేతిక సమస్యలు, స్థానిక స్థాయిలో అవగాహన లోపం వంటి అంశాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందని. వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి మేలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెజినల్ అధికారి శివశంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్‌డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# న్యాయవాది వేణుమాదవ్ అకాల మృతికి బార్ అసోసియేషన్ సంతాపం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 15 : న్యాయవాది పొన్నం వేణుమాధవ్ అకాల మృతికి యాదాద్రి భువనగిరి జిల్లా బార్ అసోసియేషన్ తరపున సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని జిల్లా ప్రిన్సిపల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి జయరాజు, డిఎల్ఎస్ కార్యదర్శి మాధవి లత, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉషారాణి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి కుమార్ తెలియజేశారు. గురువారం జిల్లా కోర్టు పరిధిలోని బార్ అసోసియేషన్ హాల్లో పొన్నం వేణుమాధవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వేణుమాధవ్ న్యాయవాది వృత్తిలో ఉంటూ అనేకమంది పేదలకు, వివిధ వర్గాల ప్రజలకు చట్టపరంగా న్యాయం కోసం చాలా పెద్ద ఎత్తున కృషి చేశాడని అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో అకస్మాత్తుగా కుప్పకూలి హార్ట్ ఎటాక్‌తో మరణించడం చాలా బాధాకరం అన్నారు. ప్రభుత్వం న్యాయవాది మృతికి స్పందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోద వెంకటేశ్వర్లు, పాశం శ్రీదర్, బబ్బురి హరినాద్, ఎం.చంద్రశేఖర్ రెడ్డి, ఎస్. జంగారెడ్డి, చేగూరి ఐలయ్య, సిహెచ్. సిద్ధిరాములు, శారధ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాలలో యావర్ రోడ్డును విస్తరించాలి

## - కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసిన బీజేపీ నేతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ధర్మపురి, మే 15 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డు విస్తరించాలని కోరుతూ జగిత్యాల బిజెపి నేతలు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం బిజెపి రాష్ట్ర నాయకుడు ముదిగంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల బీజేపీ నేతలు హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డు అత్యంత ఇరుకుగా ఉండి, అనేక ప్రమాదాలకు కారణమవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నాయకుడు, ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల సమయంలో యావర్ రోడ్ విస్తరణ అంశాన్ని లేవనెత్తి,ప్రయోజనాలు పొందుతున్నారు తప్ప, ఏ ఒక్క నాయకుడు కూడా రోడ్డు విస్తరణ పై దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యావర్ రోడ్ విస్తరణ కోసం కేంద్ర మంత్రి చొరవచూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కిషన్ రెడ్డి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, ఆంకార్ సుధాకర్, చంద్రశేఖర రావు, కిషోర్ సింగ్ తదితరులు ఉన్నారు.




# వికలాంగుల హక్కులకు భంగం కల్గించిన కండక్టర్ పై చర్యలు తీసుకోవాలి

## - విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ధరణికోట నర్సింహా

## - సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 15 : వికలాంగుల హక్కుల చట్టం-2016కు భంగం కల్గించిన తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ఉద్యోగి టిజీఎస్ ఆర్టీసీ బస్ కండక్టర్ పై చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) అధ్యక్షులు ధరణికోట నర్సింహ, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ లు డిమాండ్ చేశారు. గురువారం వారు భువనగిరి లో మీడియాతో మాట్లాడుతూ జి. రేణుక అనే వికలాంగురాలు, తన చంటి పిల్లాడితో భువనగిరి నుండి ఉప్పల్ వెళ్ళడానికి జనగాం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ నెంబర్ టీఎస్ సి-7 6864 ఎక్స్‌ప్రెస్ బస్‌ను గురువారం ఉదయం 7.15 నిమిషాలకు భువనగిరిలో ఎక్కి ఉప్పల్ వెళుతూ, బస్‌లో వికలాంగులకు కేటాయించిన సీట్లలో కూర్చోవడానికి ప్రయత్నం చేసింది. కానీ అప్పటికే ఆ సీట్లో ఇతరులు కూర్చున్నారు. రేణుక బస్ కండక్టర్‌తో చెప్పి వికలాంగులకు కేటాయించిన సీట్లలో కూర్చోవడానికి ప్రయత్నం చేసింది. కానీ కండక్టర్ ఎలాంటి స్పందన లేకుండా, వికలాంగురాలైన రేణుక కు సహకరించకుండా, ఆమెను అసభ్య పదజాలంతో దూషించి, సీటు ఉన్న బస్‌లో రావాలని, వికలాంగులకు కేటాయించిన సీట్లలో ఎవరైనా కూర్చోవచ్చు అని, బస్‌లో రాసినంత మాత్రాన అది అమలు జరిగదని, వెటకారంగా మాట్లాడుతూ, వికలాంగురాలైన రేణుక ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధరణికోట నర్సింహ, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. జనగాం జిల్లా తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ డిపో మేనేజర్, వరంగల్ రీజినల్ మేనేజర్‌లు వెంటనే స్పందించి, కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని లేనిచో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆద్వర్యం లో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.





# పుష్కరాలలో పుణ్య స్నానం చేస్తే పుణ్యం లభిస్తుంది

మొదటిపేజీ తరువాయి

మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరడం జరిగిందని, మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉన్నదని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడు పివి నరసింహారావు మంథని వాసి అన్నారు. ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన పీవీ నరసింహారావు మంథని బిడ్డ, తదుపరి శ్రీపాదరావు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. శ్రీపాద రావు సభను ఎంతో హుందాగా నడిపించారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్లు విదేశీ, స్వదేశీ పెట్టు బడులను పెట్టించడం, ప్రైవేట్ రంగంలో వేల కోట్ల పెట్టు బడులను తేవడం రాష్ట్రం అభివృద్ధిలో శ్రీధర్ బాబు కృషి చాలా గొప్పదని అన్నారు. మంథని నియోజక వర్గ అభివృద్ధికి. నిరంతరం కష్ట పడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడు కోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధి కి తక్కువ సమయం కేటాయింపు చేసి రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని తెలిపారు. శ్రీధర్ బాబు రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని కొనియాడారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చేయాలని మంత్రి కోరారని, కానీ 100 కోట్లు కావాలని అడిగార నేను 200.కోట్లు ఇస్తానని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.రాష్ట్రంలోనే కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయాడానికి వంద కాదు, రెండు వందల కోట్లు కేటాయించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు.గోదావరి, కృష్ణా పుష్కరాలను, సమ్మక్క సారాలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తా అన్నారు. మంథని నియోజక వర్గం ప్రజలు అదృష్టంగా గర్వంగా ఫీలయ్యే నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని, తప్పకుండా మంథని నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, ఇతర శాఖల అధికారులను అభినందించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముఖ్య మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి ప్రత్యేక కృషి వల్ల ఈ రోజు పుష్కరాలను అంగ రంగ వైభవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. మొట్టమొదటి సారి కాశిలో ఏవిధంగా హారతి ఇస్తారో సరస్వతి హారతి కాళేశ్వరంలో చేయాలని ముఖ్యమంత్రి సూచన మేరకు కాశి నుండి పండితులను ప్రత్యేకంగా రప్పించడం జరిగిందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అన్ని శాఖల సమన్వయంతో రాబోవు 11 రోజుల పాటు జరిగే పుష్కరాలను విజయ వంతంగా నిర్వహించ బోతున్నామని అన్నారు. మాదవానంద సరస్వతి సూచన మేరకు దేవాలయాల పవిత్రను కాపాడాలని కోరారు. ముఖ్య మంత్రి సూచనల మేరకు ఈరోజు కాళేశ్వరం లో సరస్వతి పుష్కరాలను నిర్వహిస్తున్నామని, పెద్ద చరిత్ర కలిగిన కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్ ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని సీఎంను కోరారు. మారుమూల ప్రాంతం అయిన కాళేశ్వరం టూరిజం హబ్ గా అభివృద్ధి చేయాలని కోరారు. 20 సంవత్సరాల కాలంలో పెండింగ్ ఉన్న చిన్న కాళేశ్వర ప్రాజెక్ట్ పనుల ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ వల్ల విజయ వంతంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మళ్ళీ ఒక్క సారి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతున్నామని తెలిపారు. తన తండ్రి శ్రీపాదరావు ఆశయాల మేరకు నియోజక వర్గం అభివృద్ధి చేస్తున్నామని, సీఎం ప్రత్యేక చొరవతో ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 3 కోట్ల రూపాయలుతో బస్టాండ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పుష్కరాలను అంగరంగ వైభవంగా జరగాలని గొప్ప సంకల్పంతో ఈరోజు పుష్కరాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దేశంలో ఇతర రాష్ట్రాలు తెలంగాణను చూస్తున్నాయని, గతంలో ఎన్నడు లేని విధంగా గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి వల్ల భక్తుల సౌకర్యార్థం సరస్వతి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దేవాదాయశాఖ తో పాటు ఇతర శాఖల అధికారులు ఎంతో గొప్పగా ఏర్పాట్లు చేశారని అభినందించారు.తెలంగాణ రాష్ట్రంలో సరస్వతి పుష్కరాలను గగనంగా నిర్వహించి కుంటున్నామని, ఇదే స్ఫూర్తితోరాబోయే రోజుల్లో వచ్చే గోదావరి, ప్రాణహిత , కృష్ణ పుష్కరాలు, మేడారం జాతరలను ఘనంగా నిర్వహించబోతున్నామని అన్నారు. భక్తుల వేసవి దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలని గోదావరి పరిసరాల్లో భక్తులు స్నానాలు చేసి వ్యర్థాలను గోదావరిలోను, పరిసరాల్లో వేయకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు.అధికారులు మిగిలిన 111 జరగబోయే కార్యక్రమాలను నిబద్ధతతో పని చేసి పుష్కరాలను విజయవంతం చేయాలని.సూచించారు. భక్తుల పుష్కర స్నానం చేసి క్షేమంగా ఇంటికి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత పెద్ద పెద్ద ఎత్తున పుష్కరాలకు ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా ఈ రోజు ఇంత ఘనంగా సరస్వతి పుష్కరాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. దేశ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షించి ఈ పుష్కరాలను నిర్వహించడం శుభ సూచకమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్న ఈ పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేసిన ముఖ్య మంత్రి ధన్యవాదాలు తెలిపారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాకాళీ, మహాలక్ష్మీ కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంలో సరస్వతి కటాక్షంతో మంచి విద్యను విద్యార్థులను అందించాలని సరస్వతి అమ్మ వారి కటాక్షం ఉండాలని కోరుతూ ఎంత పెద్ద ఎత్తున పుష్కరాలకు ఏర్పాట్లు చేసిన ముఖ్య మంత్రి గారికి ధన్యవాదాలు తెలుపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్, శాసన సభ్యులు మక్కడ్ ఠాకూర్, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మక్కన్ సింగ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, ఎస్పి కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాశీ పండితులు 45 నిమిషాల పాటు నిర్వహించిన సరస్వతి నవరత్న హారతి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పేల్చిన బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపైరాష్ట్రపతి,గవర్నర్3నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబీ పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా? గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు -- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలు జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

# కాళేశ్వరం వేద మంత్రోచ్ఛారణలతో మారు మ్రోగింది

మొదటిపేజీ తరువాయి



విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు. అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానలను కూడా నిర్వహించారు. శ్రీ గురుమదానానంద సరస్వతి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు. అనంతరం శ్రీ కాళేశ్వర, మక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి, సరస్వతి మాత ఆలయాలను ప్రముఖులు సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం గత కొన్ని రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి.పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి మాతా అశీస్సులు పొందాలని సూచించారు.

# 8వేల కోట్ల ఫీజు బకాయిలు - తక్షణమే చెల్లించి ఆదుకోండి

మొదటిపేజీ తరువాయి

బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

మొదటిపేజీ తరువాయి

యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.





# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

## కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం

బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు– సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు– పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు– చేశారు.

# కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

ఎలాంటి మాటలు మాట్లాడు తున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు- వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు సన్నాహక కార్యకలాపాలను సమీక్షించడానికి కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, సంఘాల సంయుక్త వేదిక సమావేశం గురువారం న్యూఢల్లీలో జరిగింది. ఈ సమావేశం తర్వాత కేంద్ర కార్మిక సంఘాల్కెన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్.ఎం ఎస్., సీఐటీయూసీ, ఏఐటీయూసీ, టీయూసీసీ, ఏసీడబ్లుఎ, ఏఐసీసీటీయూ, ఎల్పీఫ్, యూటీయూసీ, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, సంఘాలు పత్రికలకు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. మే 9న పహల్గామ్‌లో 26 మంది అమాయకులను బలిగొన్న దారుణమైన ఉగ్రవాద దాడి తర్వాత దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను, భారత సాయుధ దళాల పోరాట సమ్మె చర్యలను ఈ సమావేశం పరిగణలోనికి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా పహల్గామ్‌లో అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రవాద దాడిని ఉమ్మడి వేదిక తీవ్రంగా ఖండిరచినట్లు ప్రకటనలో తెలిపారు. దేశంలో విభజనాత్మక ద్వేషపూరిత ప్రచారాన్ని చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా వేదిక ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ జమ్మూ, కాశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజలు తక్షణ సమిష్టి ప్రతిస్పందనను, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే సంపూర్ణ పోరాటంలో వారి ఐక్యత, సంఫీభావాన్ని నొక్కిచెప్పడాన్ని వేదిక సమావేశంలో ప్రశంసించినట్లు ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితిని సముచితంగా పరిశీలించిన తర్వాత, దేశంలోని బాధ్యతాయుతమైన దేశభక్తి పౌరులలో అంతర్భాగంగా ఉమ్మడి వేదిక, కార్మిక కోడ్‌ల అమలు, కార్మికులు, రైతులు, సాధారణంగా ప్రజల ఇతర చట్టబద్ధమైన డిమాండ్లకు వ్యతిరేకంగా మే 20 నుండి జూల్కై 9కి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను తిరిగి షెడ్యూల్ చేయాలని నిర్ణయించినట్లు, . మే 20న రాష్ట్ర రాజధానులలో, జిల్లాలలో, పరిశ్రమలలో, కార్యాలయాలలో భారీ ప్రదర్శనలు, సమీకరణలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడిరచారు. ఉగ్రవాద ఊచకోత తత్ఫలితంగా దేశంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల మధ్య కూడా కేంద్రంలో, అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలచే చురుకుగా మద్దతు ఇవ్వబడిన యజమానుల వర్గం అన్ని సంస్థలలోని కార్మికులు, ఉద్యోగులపై దాడులను కొనసాగించడాన్ని అత్యంత భయంకరమైన విషయంగా సమావేశం భావించింది. పని గంటలను ఏకపక్షంగా పెంచడం, చట్టబద్ధమైన కనీస వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలను ఉల్లంఘించడం. కార్మికులను, కాంట్రాక్టు కార్మికులను శిక్షార్హత లేకుండా తొలగించడం లాంటి చర్యలను యాజమాన్యాలు చేపట్టడం జరిగిందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, అపఖ్యాతి పాల్కెన కార్మిక కోడ్‌లను బ్యాక్‌డోర్ ద్వారా అమలు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను దారుణమైనవిగా సమావేశం ముక్తకంఠంతో ఖండిరచింది. అదే సమయంలో కార్మిక సంఘాలు పదే పదే ఒప్పించినప్పటికీ, దేశంలోని అన్ని రంగాల నుండి సమ్మె నోటీసులు అందుకున్నప్పటికీ, ప్రభుత్వం కేంద్ర కార్మిక సంఘాలను కలవడానికి గాని, సంప్రదించడానికి గాని భారత కార్మిక సమావేశాన్ని నిర్వహించడానికి గాని పట్టించుకోలేదని సమావేశంలో విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, యూనియన్లు సార్వత్రిక సమ్మెకు తమ సన్నాహాలను తీవ్రంగా కొనసాగించాలని జూల్కై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె పిలుపును భారీ విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, సంఘాల ఉమ్మడి వేదిక పిలుపునిచ్చింది. అంతేకాకుండా, కార్మిక సంఘాల ఉద్యమం యొక్క సానుకూల విధానానికి భారత ప్రభుత్వం ప్రతిస్పందించాలని, కార్మిక కోడ్‌లు, పని పరిస్థితులు, కార్మికుల హక్కులకు సంబంధించిన ఇతర చట్టబద్ధమైన డిమాండ్లు, వ్యక్తిగతంగా గాని, సమిష్టిగా గాని, ఏకపక్షంగా గాని ముందస్తు చర్యలు తీసుకోకుండా ఉండాలని, దేశం మొత్తం ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట సమయంలో ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదని ఉమ్మడి వేదిక డిమాండ్ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

**- కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు**
**- సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా**
**- మండిపడ్డ మంత్రి సీతక్క**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 15 : మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు వీరీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-ట్కెర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం..అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం వీరీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత వీరీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు వీరీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం వీరీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

# చెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 15 : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పెద్దచెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిమ్స్‌లో అబిజిత్ జాయ్ అనే విద్యార్థి ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం అభిజిత్ చెరువుతో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని చెరువులోని నుంచి బయటకు తీశారు.మృతుడి అభిజిత్ జాయ్ గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# గులాబీలో కుర్చీలాట

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మే 15 : భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు. 2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ,రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడిరచి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి,అసహనానికీ తార్కానంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పోలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు.పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

**- పోచంపల్లిలోనూ ఇక్కత్ చీరలపై మక్కువ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి మే 15 : మిస్‌వరల్డ్ పోటీ కోసం హైదరాబాద్ చేరుకున్న అందగత్తెలు వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు. టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

# స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

**- కనిష్ట ధర 12..గరిష్ట ధర 75కు పెంపు**
**- 17వ తేదీనుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 15 : మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడిరచింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాడు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మెట్రో రైలు సంస్థ వెనకడుగు వేసింది. కానీ మెట్రో రైలు సేవల కారణంగా.. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీంతో ఛార్జీల పెంపు అనివార్యమైందని తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సమాచారం. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు భారీ నష్టాలతో నడుస్తుందని ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెట్రో ఛార్జీలు పెంపు అనివార్యమని స్పష్టం చేసింది. దీంతో మే 10వ తేదీ తర్వాత మెట్రో ఛార్జీలు పెంచుతామని ఇప్పటికే స్పష్టం చేసింది. అందులోభాగంగా మే 17వ తేదీ నుంచి ఈ ఛార్జీల పెంపు వర్తిస్తుందని ఆ సంస్థ వెల్లడిరచింది. ప్రభుత్వం అందిస్తున్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మీ పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు నష్టాల బాటలో నడిచేందుకు ఇది ఒక కారణమని ఎల్ అండ్ టీ- సంస్థ ఇప్పటికే అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా మెట్రోలో ప్రయాణించందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు.

# అత్యాచారయత్నం కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 15 : అత్యాచారయత్నం కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష తో పాటు నలభైవేల రూపాయల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐ గుంపుల విజయ్ తెలిపిన వివరాల ప్రకారం ....కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండాయి పేట్ గ్రామంలో 2022 సెప్టెంబర్ 4 తేదీన బాధిత యువతి (20)తన ఇంట్లో స్నానం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన చాప్లె చందు (24) బాత్ రూమ్ లోకి చొరబడి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు అరుపులు వేయగా ఇంట్లో ఉన్న బాధితురాలి నానమ్మ ఎవరు అంటూ అడగ్గా నిందితుడు అక్కడనుంచి పారిపోయాడు. తర్వాత ఇంటికి వచ్చిన తండ్రి కి జరిగిన విషయం చెప్పగా అతను మరుసటి రోజు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈ కేసుకు సంభందించి పీపీ జగన్మోహన్ రావు బాధితుల తరపున వాదనలు వినిపించి సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారని పేర్కొన్నారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన కోర్టు లైజన్ ఆఫీసర్ బాబాజీ, సిబ్బందిని కాగ జ్ నగర్ డీ ఎస్పీ రామానుజం అభినందించారు.

# ఆరోగ్యం



## మాంసం తింటే కొత్త రోగం..

### చేతులు ఇలా మారిపోతున్నాయట,ఎలా గుర్తించాలంటే?

రోజు రోజూ మారుతున్న జీవన విధానానికి అనుగుణంగా ప్రతిరోజూ కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. అసలు కొన్ని వ్యాధులు ఎందుకు వస్తున్నాయో కూడా అర్థంకానీ పరిస్థితుల్లో మనం జీవిస్తున్నాం. మరీ ముఖ్యంగా కరోనా తరువాత ఎలాంటి చిన్న వ్యాధి వచ్చినా ప్రజలందరూ కంగారు పడిపోతున్నారు. అయితే మన శరీరంలో ఉండే కొవ్వు కారణంగా కూడా అనేక సమస్యలు వస్తాయన్న విషయం తెలిసిందే. అయితే, అమెరికాలోని ఫ్లోరిడాలోని టంపా ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి శరీరంలో నుంచి కొవ్వు లీక్ అవుతుందట. ఈ విస్మయకరమైన మార్పులను చూసి, ఆందోళన చెందిన ఆ వ్యక్తి వెంటనే వైద్యులను సంప్రదించాడు. దీంతో వైద్యులు అతనికి దానికి సంబంధించిన ఆందోళనతో వైద్యులను సంప్రదించాడు.

**చేతులు, కాళ్ల ద్వారా కొలెస్ట్రాల్ లీక్ అవడం:** జామా కార్డియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన కథనం ప్రకారం అమెరికాకు చెందిన ఒక 40 సంవత్సరాల వ్యక్తి తన శరీరంలో పసుపు రంగు ఛాయలను గమనించాడు. అయితే అతను మొదటగా సాధారణమైనవే అని అనుకున్నాడు. కానీ కొద్ది రోజుల తరువాత అవి మరింత పెరిగిపోయాయి. దీంతో ఆ వ్యక్తి టంపా జనరల్ హాస్పిటల్‌కు వెళ్లి వైద్యులను సంపాదించారు. దీంతో అతడిలో విచిత్రమైన ఆరోగ్య పరిస్థితిని కనుగొన్నారు. వైద్యులు ఏం చెప్పారు?

ఆయన పూర్తి మెడికల్ రిపోర్టులు పరిశీలించిన తరువాత, వైద్యులు అతనిలో అత్యధిక స్థాయిలో కొవ్వు పదార్థాలు ఉండడం వల్ల ఈ సమస్యలు ఏర్పడ్డాయని చెప్పారు. అతను అనుసరించిన కీటోజెనిక్ డైట్ కారణంగా, శరీరంలో ఎక్కువ కొవ్వు, కొలెస్ట్రాల్ పెరిగాయి. దీంతో అతని శరీరం నుంచి కొవ్వు పదార్థాలు లీక్ అవడం ప్రారంభమవుతుందని చెప్పారు.

కొలెస్ట్రాల్ ప్రభావం అతనికి చర్మంలో పసుపురంగు ఛాయలు కనిపించినప్పటికీ, వైద్యులు ఈ లక్షణాలను "క్శాంథెలాస్మా"గా నిర్ధారించారు. ఇది శరీరంలోని కొవ్వు నిల్వలు.. చర్మం కింద ఉత్పత్తి కావడం వల్ల ఏర్పడుతుంది. ఇది ప్రమాదకరమైనది కాదు, కానీ అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు అథెరోస్క్లెరోసిస్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈరుగ్మతలో, కొలెస్ట్రాల్ ధమనుల గోడలపై పేరుకుపోవడం వల్ల రక్త ప్రవాహం తగ్గిపోతుంది, ఇది గుండె జబ్బులకు, ఇస్కీమిక్ స్ట్రోక్ లాంటి తీవ్రమైన పరిస్థితులకు కారణం కావచ్చు.

**మాంసాహారం యొక్క ప్రమాదాలు:** హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రకారం, ఎక్కువ కాలం మాంసాహారం తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడటం, బోలు ఎముకల సమస్యలు, మూత్రపిండాల పనితీరు తగ్గడం వంటి సమస్యలకు కారణం అవుతుంది. మాంసాహారం ఆరోగ్య ప్రయోజనాలను అందించినప్పటికీ, అది ఎక్కువ మోతాదులో, ఎక్కువ కాలం తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన జబ్బులు కూడా రావచ్చు.

## మన పూర్వికులు వండే మటన్ కూర

**ప్రస్తుతం ఉన్న ఉద్యోగ ఒత్తిడి, కాలుష్యం, ఇతర కారణాల వలన చాలా మంది పాతకాలంలో ఎలా జీవించేవారో అలానే జీవించాలని అనుకుంటున్నారు. అందుకోసం ఫామ్ హౌస్‌లు కట్టుకొని మరీ ఉంటున్నారు. అలాగే ఆర్గానిక్ అంటూ.. పాతకాలం నాటి ఆహారం తినడానికి ఇష్టపడుతున్నారు. అలాంటి వాటిలో ఒకటే మటన్. గతంలో మటన్ కూరను చాలా సాంప్రదాయకమైన పద్ధతిలో చేసుకునేవారు. ఆర్గానిక్ మసాలాలు కలిపి ఈ కూరను తయారు చేసుకునే వారు. ఈ స్టోరీలో మన పూర్వికులు ఏ విధంగా మటన్ కూరను వండుకునేవారో తెలుసుకుందాం.**

పూర్వీకుల మాదిరిగా మటన్ కూర వండుకోవడానికి కావాల్సిన పదార్థాలు : 1 కేజి మటన్ 2 ఉల్లిపాయలు 2 టమోటాలు 1 అల్లం వెల్లుల్లి పేస్ట్ 2 పచ్చిమిర్చి 1, ధనియాల పొడి 1 స్పూను, జీలకర్ర పొడి 1 స్పూను, గరం మసాలా 1/2 స్పూను, పసుపు 1/2 స్పూను కారం రుచికి సరిపడా ఉప్పు 2 స్పూన్లు, నూనె కొత్తిమీర మటన్ కూర తయారీ విధానం ముందుగా మటన్ ను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా చేసుకోవాలి. ఉల్లిపాయలు, టమోటాలను కూడా చిన్నగా కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో మటన్, ఉల్లిపాయలు, టమోటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు, కారం, ఉప్పు మరియు నూనె వేసి బాగా



కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గంట పాటు నానబెట్టాలి. ఒక మట్టి పాత్ర తీసుకొని నానబెట్టిన మటన్ మిశ్రమాన్ని వేసి 2 కప్పుల నీరు పోసి ఒక 30 నుంచి 40 నిమిషాల పాటుఉడికించాలి. ఆ తర్వాత మూత తీసి కూరను బాగా కలుపుకోవాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడి వేడిగా అన్నం లేదా




రోటీతో సర్వ్ చేయాలి. అంతే ఎంతో రుచికరమైన మటన్ కూర సిద్ధమైనట్లే.

## ఉల్లిపాయ పులుసు,ఒక్కసారి తింటే సాంబార్‌ని మర్చిపోతారు, ఎలా చేసుకోవాలో తెలుసా?



చాలా మందికి సాంబార్ లేదా పచ్చి పులుసు ఇష్టం ఉంటుంది. అవి లేకుండా ముద్ద కూడా తినని వాళ్ళు చాలా మంది ఉంటారు. మరీ ముఖ్యంగా శాఖాహార ప్రియులకు ఇది ఎంతో ఇష్టమైన వంటకం. అలాంటి పులుసులో ఉల్లిపాయ పులుసు ఒకటి. ఇది చాలా ప్రాచీనమైన వంటకం. అలాగే ఎంతో మందికి ఇష్టమైనది కూడా. ఇది సులభంగా తయారైపోయే ఒక ప్రాచీన వంటకం. దీనిని ఎలా తయారు చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ఉల్లిపాయ పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు: చిన్న ఉల్లిపాయలు – 15 చింతపండు – చిన్న నిమ్మపండు సైజు అంత నూనె – 3 టేబుల్ స్పూన్లు ఆవాలు – 1/2 టీస్పూన్ మెంతులు – 1/4 టీస్పూన్ కరివేపాకు – 2 రెబ్బలు ఎండుమిర్చి – 4 పసుపు – 1/4 టీస్పూన్ కారం – 1/2 టీస్పూన్ ధనియాల పొడి – 1 టీస్పూన్ జీలకర్ర పొడి – 1/2 టీస్పూన్ ఉప్పు – రుచికి తగినంత బెల్లం – చిన్న ముక్క

ఉల్లిపాయ పులుసు తయారీ విధానం: ముందుగా చింతపండును నానబెట్టి పులుసు తీసుకోండి. చిన్న ఉల్లిపాయలను పొట్టు తీసి సగానికి కట్ చేసుకోండి. స్టవ్ మీద ఒక గిన్నెలో నూనె వేడి చేసి ఆవాలు, మెంతులు, కరివేపాకు, ఎండుమిర్చి వేసి వేయించండి. ఆ తరువాత అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి. అనంతరం పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి కాసేపు వేయించండి. తరువాత చింతపండు పులుసు, ఉప్పు, బెల్లం వేసి బాగా కలపండి. పులుసు చిక్కబడే వరకు ఉడకనివ్వండి. రుచి చూసుకుని, దించుకొని వేడి వేడి అన్నంలో వడ్డించుకుంటే ఎంతో రుచికరమైన ఉల్లిపాయ పులుసు సిద్ధమైనట్లే.

## ఈ చట్నీ తింటే మీ బాడీలో చెడు కొవ్వు ఉండదు

## గుండె జబ్బులు కూడా రావు

మారిన జీవన శైలి, మారుతున్న తినే ఆహారం, ఇతర అలవాట్ల కారణంగా ఈ మధ్య కాలంలో గుండె జబ్బులతో మరణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతుంది. గుండె సమస్యలు రావడానికి ముఖ్యమైన కారణం చెడు కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోవడం. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వలన, అధిక రక్తపోటు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్స్ వంటి వ్యాధులు వస్తున్నాయి. ఈ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడానికి చాలా మంది రకరకాల డైట్స్, వర్క్ ఔట్స్ చేస్తుంటారు. అయితే ఎవరికైతే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోయిందో వారు ఈ చట్నీలను తినడం వలన అనేక మంచి ప్రయోజనాలను పొందుతారు. అలాగే వారికి ఎటువంటి ఆరోగ్య సమస్య కూడా రాదు. ఆ చట్నీలు ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.



పుదీనా పచ్చడి పుదీనా పచ్చడిలో ఫైబర్, క్లోరోఫిల్ ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు ఉపయోగకరంగా ఉంటాయి. ఈ పచ్చడిని తీసుకోవడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. రోజుకు ఒకసారి ఈ పచ్చడిని మీ డైట్‌లో చేర్చుకోవడం మంచిది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచి, శరీరంలో ఉండే చెడు కొవ్వును కరిగించడానికి సహాయపడతాయి.

మెంతికూర పచ్చడి మెంతి ఆకులతో తయారు చేసిన పచ్చడిలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. మెంతి పచ్చడిలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. శరీరాన్ని చల్లబరుస్తుంది. దీనితో పాటు మీరు మెంతి ఆకులతో పచ్చడి మాత్రమే కాకుండా పలు వంటలు కూడా చేసుకోవచ్చు. పాలకూర పచ్చడి పాలకూరలో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఉంటాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ధమనుల్లో రక్తగడ్డలు ఏర్పడకుండా చేస్తుంది. పాలకూర ఆకులు, కొత్తిమీర, పుదీనా కలిపి ఈ చట్నీ తయారుచేయవచ్చు. బతువా చట్నీ బతువాలో ఉన్న ఫైబర్, రఫ్టేజ్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చు, అలాగే జీర్ణవ్యవస్థను కూడా సక్రమంగా ఉంచుకోవచ్చు. కరివేపాకు చట్నీ కరివేపాకులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధ గుణాలు చెడు కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాయపడతాయి. ఈ చట్నీ కూరగాయల్లో చేర్చుకొని తయారుచేసి తినవచ్చు. అలాగే నేరుగా కరివేపాకుతో పచ్చడి చేసుకొని కూడా తీసుకోవచ్చు. మీ బ్రేక్ ఫాస్ట్‌కి దోశ, ఇడ్లీ, ఉప్మా వంటివి ఈ చట్నీలతో తినడం ద్వారా మీరు మంచి బలీష్టమైన ఆరోగ్యాన్ని పొందగలుగుతారు.

# సినిమా న్యూస్



## చీరందంలో మాళవిక మైమరిపించేలా!



కేరళ కుట్టీ మాళవిక మోహనన్ టాలీవుడ్ ఎంట్రీకి ముందే తెలుగు ఆడియన్స్ ని ఊపేస్తోంది. రాజాసాబ్‌తో టాలీవుడ్ లో లాంచ్ అవుతున్నా? ఆ సినిమా తో సంబంధం లేకుండా క్రేజీ బ్యూటీగా మారిపోతుంది. ఎప్ప టికప్పుడు కొత్త కొత్త ఘాటు పోజులతో ఇంటర్నెంట్ సంచనలంగా మారడంతోనే ఇది సాధ్యమైంది. మాలీవుడ్..బాలీవుడ్ లో ఎలాగూ క్రేజ్ ఉంది. ఆ క్రేజ్ సైతం టాలీవుడ్ కి కలిసొస్తుంది. రెండు పరిశ్రమల్లో ఇప్పటికే గ్లామర్ గేట్లు తెరిచేసేంది. సందర్భం వచ్చినప్పుడల్లా చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. క్లీవేజ్ అందాలతో...థైషోస్ తో యువతని ఆకర్షిస్తుంది. ఇన్ స్టాలో సంచలనంగా మారు తుంది. సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం చాలా అరుదు. తాజాగా అమ్మడు చీరందంలో తళుకులీన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. ఇందులో అమ్మడు బ్లాక్ అండ్ బ్లాక్ అమ్మడి స్కిన్ టోన్ తళత ళలాడిపోతుంది. చేతిలో మినీ హ్యాండ్ బ్యాగ్ అంతే హైలైట్ అవుతుంది. నలుపు రంగు చీరపై మ్యాచింగ్ అదే రంగు రవిక ధరించి హొయలు పోయింది. చేతిలో స్మార్ట్ ఫోన్ తో సెల్ఫీలు దిగుతూ రకరకాల భంగిమల్లో కెవ్వూరాకి ఫోజులిచ్చింది. పెదాలకు ఎర్రని లిప్ స్టిక్.. ఐబ్రోస్ మధ్య లో ఎర్రటి స్టికర్.. చెవులకు ధరించిన బులకాలు మాళవిక అందాన్ని రెట్టింపు చేసాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. మాళవిక సోషల్ మీడియా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఆ సంగతి పక్కనబెడితే మాళవిక రాజాసాబ్ ఎప్పుడు రిలీజ్ అవుదుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది. కొంత మంది భామలు ఆన్ సెట్స్లో ఉండగానే రెండు..మూడు ఛాన్సులందుకుంటే? ప్రభాస్ సరసన నటించినా మాళవికకు తెలుగులో కొత్త అవకాశాలు రాలేదు. అయితే బాలీవుడ్ లో మాత్రం ఛాన్సులు బాగానే అందుకుంటుంది.

## వెల్‌కమ్ టు బ్రహ్మణి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోడలు, మంత్రి నారా లోకేష్ భార్య, సీనియర్ స్టార్ హీరో బాలకృష్ణ కూతురుగా బ్రహ్మణి కావాల్సినంత గుర్తింపు ఉంది. అయినా కూడా ఆమె తన ప్రత్యేకతను ఎప్పటికప్పుడు చూపిస్తూనే ఉంటుంది. వ్యాపారంలో ఎప్పుడూ తనకంటూ గుర్తింపు దక్కించుకోవడంతో పాటు, సోషల్ సర్వీస్‌లోనూ నారా బ్రహ్మణి మంచి పేరు దక్కించుకుంది. ముఖ్యంగా నారా బ్రాహ్మణి పేరు చెప్పగానే హెరిటేజ్ గుర్తుకు వస్తుంది. రాజకీయాలతో మామ, భర్త చాలా బిజీగా ఉన్నప్పటికీ అన్ని తానై వ్యాపారంను చేస్తుంది. వ్యాపారంను విజయవంతంగానూ ఆమె నడపడంలో సక్సెస్ అయింది అనడంలో సందేహం లేదు.నారా బ్రహ్మణికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నారు. ఈమెను కొందరు అభిమానిస్తే కొందరు విమర్శిస్తూ కామెంట్స్ చేస్తూ ఉంటారు, వాటన్నింటిని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. వ్యాపారంలో తనకు పోటీ ఎవరు లేరు అనే విధంగా విజయపథంలో దూసుకు పోతుంది. సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు, రాకజీయాల్లో తన అవసరం ఉన్నప్పుడు కచ్చితంగా ముందు ఉంటుంది అని చాలా సందర్భాల్లో నిరూపితం అయ్యింది. బ్రహ్మణి ఎన్నో సార్లు నారా లోకేష్ కి మద్దతుగా జనాల్లోకి వెళ్లడం మనం చూశాం. లోకేష్ రాజకీయ ఎదుగుదలలో బ్రహ్మణి పాత్ర కీలకం.

## సూపర్ హిట్ మూవీ మూడో పార్ట్ ఉన్నట్టా? లేనట్టా?



బాలీవుడ్ సూపర్ హిట్ ఫ్రాంచైజీల్లో మున్నా భాయ్ ఒకటి. ఇప్పటి వరకు మున్నాభాయ్ ఎంబీబీఎస్, లగేరహో మున్నాభాయ్ సినిమాలు వచ్చాయి. సంజయ్ దత్ నటించిన ఆ రెండు సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఆ రెండు సినిమాలను తెలుగులో మెగాస్టార్ చిరంజీవి రీమేక్ చేసిన విషయం తెల్సిందే. తెలుగులో శంకర్ దాదా ఎంబీబీఎస్, శంకర్ దాదా జిందాబాద్ సినిమాలతో మెగాస్టార్ చిరంజీవి సైతం సూపర్ హిట్స్‌ను సొంతం చేసుకున్న కారణంగా అన్ని భాషల్లోనూ మున్నాభాయ్ ఫ్రాంచైజీలో మూడో పార్ట్ కోసం ఆసక్తి వ్యక్తం అవుతోంది. ఆ మధ్య మూడో సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో ప్రముఖంగా చర్చ జరిగింది. దర్శకుడు రాజ్ కుమార్ హిరాని కూడా మున్నాభాయ్ 3 సినిమా విషయంలో ఆసక్తిగా ఉన్నట్లుగా స్వయంగా చెప్పుకొచ్చాడు. తాను త్వరలోనే సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్‌ను రెడీ చేస్తాను అన్నట్లుగా చెప్పుకొచ్చాడు. ఆ మధ్య కొన్ని రోజులు వర్క్ కూడా జరిగింది. కానీ తాజాగా బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం ఇప్పట్లో మున్నాభాయ్ 3 సినిమా ఉండక పోవచ్చు. సూపర్ హిట్ సినిమాలను రూపొందించిన రాజ్ కుమార్ హిరానీ కచ్చితంగా స్క్రిప్ట్ విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి చెందితేనే షూటింగ్‌కి వెళ్తాడు. కానీ ఇప్పటి వరకు మూడో పార్ట్ కోసం కథ రెడీ కాలేదని, అందుకే సినిమాను క్యాన్సల్ చేసే ఉద్దేశం ఉందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రాజ్ కుమార్ హిరానీ చివరగా డంకీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా యావరేజ్‌గానే నిలిచింది. ఆయన స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేక పోయాడు. అంతే కాకుండా డంకీ సినిమా తర్వాత కొత్త సినిమా విషయంలో దర్శకుడు వెంటనే నిర్ణయం తీసుకోలేక పోతున్నాడు. ఇలాంటి సమయంలో ఫ్రాంచైజీ కథ విషయంలో దృష్టి పెట్టలేక పోతున్నాడని, అందుకే సీక్వెల్ విషయంలో ఒక నిర్ణయానికి రాలేక పోతున్నాడు అంటూ సమాచారం అందుతోంది. అతి త్వరలోనే రాజ్ కుమార్ హిరానీ తన తదుపరి సినిమాను ఆమీర్ ఖాన్‌తో చేసే అవకాశాలు ఉన్నాయి. వీరిద్దరి కాంబోలో వచ్చిన 3 ఇడియట్స్, పీకే సినిమాలు సూపర్ హిట్ అయిన విషయం తెల్సిందే. విక్రాంత్ మాసే, విక్కీ కౌశల్‌తో ప్రస్తుతం రాజ్ కుమార్ హిరానీ వెబ్ సిరీస్‌ను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ వెబ్ సిరీస్‌ను త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. విభిన్నమైన సినిమాల మేకర్‌గా గుర్తింపు దక్కించుకున్న రాజ్ కుమార్ హిరానీ మున్నాభాయ్ చేస్తే కచ్చితంగా మరో భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. హిందీ సినిమా ఇండస్ట్రీలో ఈ మధ్య కాలంలో పెద్ద విజయాలు దక్కలేదు. అందుకే ఈ సినిమా విషయంలో ఇండస్ట్రీ వారు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత అయినా మున్నాభాయ్ మూడో పార్ట్ వచ్చేనా అనేది చూడాలి.

## బాడీ కాఫీలా వేడిగా స్ట్రాంగ్‌గా ఉండాలి: రాయ్ లక్ష్మీ



రాయ్ లక్ష్మీ పరిచయం అవసరం లేదు. తమిళం, మలయాళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో ఈ భామ నటించింది. ఇటీవల కెరీర్ కొంత స్లో అయింది. కానీ సోషల్ మీడియాల్లో స్పీడ్ గా ఉంది. వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ వేడెక్కించే క్యాప్షన్స్ తో రాయ్ లక్ష్మీ ఆకట్టుకుంటోంది. తాజాగా షేర్ చేసిన బాడీ హగ్గింగ్ ట్రాక్ సూట్ పై వేడెక్కించే వ్యాఖ్యను జోడించింది. నా బాడీ నా కాఫీలా ఎప్పుడూ వేడిగా స్ట్రాంగ్ గా ఉండాలని అంది. అయితే ఇది బ్రూ కాఫీనా? లేక అరకు కాఫీనా? అంటూ నెటిజనులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. రాయ్ లక్ష్మీ హాలి ఫోజులు ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అవుతున్నాయి. ఇటీవల జీ టీవీ ఇంటర్వ్యూలో రాయ్ లక్ష్మీ తన పాత రోజులను గుర్తు చేసుకుంది. నటిగా కెరీర్ ఆరంభమే భారత క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనితో డేటింగ్ చేసిందనే పుకార్లు సంచలనంగా మారాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభ రోజుల్లో 2008లో వారి రిలేషన్ గురించి కథనాలొచ్చాయి. కలిసి జంటగా పార్టీలలో సందడి చేయడం పుకార్లకు ఆజ్యం పోసింది. ధోని అప్పట్లో రాయ్ లక్ష్మి పుట్టినరోజు వేడుకలకు కూడా హాజరవ్వడం చర్చగా మారింది. కానీ ఆ తర్వాత ఆ ఇద్దరి మధ్యా బ్రేకప్ అయింది. 2014లో రాయ్ లక్ష్మీ ఈ పుకార్ల గురించి మాట్లాడుతూ.. ధోనితో తన సంబంధం ఒక మచ్చ లేదా మరక లాంటిదని చెప్పారు. అది చాలా కాలం వరకు మాయమవదు. ఇప్పటికీ ప్రజలు దాని గురించి మాట్లాడటానికి శక్తి, ఓపికను కలిగి ఉండటం నాకు ఆశ్చర్యం కలిగిస్తుందని వ్యాఖ్యానించింది. టీవీల్లో ఎప్పుడూ దీనినే ప్రస్థావిస్తారు. ఏదో ఒక రోజు నాకు పుట్టబోయే పిల్లలు దానిని టీవీలో చూసి దాని గురించి అడుగుతారని నేను భయపడుతున్నాను! అని కూడా అంది. తాము స్నేహితులం మాత్రమేనని, స్నేహపూర్వకంగా విడిపోయామని కూడా తెలిపింది. ఎం.ఎస్.ధోని వివాహం చేసుకున్నాడు... అది కథకు ముగింపు అని కూడా రాయ్ లక్ష్మీ ఇటీవలి ఇంటర్వ్యూలో పేర్కొంది. ప్రస్తుతం తాను సంతోషంగా ఉన్నానని, తన కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టానని చెప్పింది. నటన తన తొలి ప్రాధాన్యత అని కూడా వెల్లడించింది.

# పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

## - వాటి రక్షణపై అనుమానాలు ఉన్నాయి
## - అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీస్వాధీనం చేసుకోవాలి
## - పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్
## - కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 15 : బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపంచ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమానిక దళాలు దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు- ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్షణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శుత్రవులను నాశనం చేసిన శక్తి ఇక్కడ ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పని పట్ల దేశం గర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నాథ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. -టె-ర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు- పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలోభాగంగా చినార్ కోర్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి.. ఆర్మీ, వాయుసేన సిబ్బందితో మాట్లాడనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా జమ్మూకశ్మీర్‌లోనే పర్యటించారు. ఆయన నేడు చినార్‌కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద నిర్భయంగా, అప్రమత్తంగా ఉన్నారని అభినందించారు.

# పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

## - కళ్లకు గంతలు కట్టి మాటలతో హింస

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



న్యూఢిల్లీ, మే 15 : పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారని సమాచారం. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు- కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు- భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# అమెరికాలో ప్రమాదానికి గురైన పర్వతారోహకులు

## భారతీయ సంతతికి చెందిన వ్యక్తి మృతి

న్యూయార్క్, మే 15 : అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పర్వతారోణణకు వెళ్లిన బృందంలో ముగ్గరు దుర్మరణం చెందారు. అందులో భారతీయ సంతతికి చెందిన ఒకరు ఉన్నట్లు గుర్తించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని నార్త్ క్యాస్కేడ్స్ పర్వతారోహణకు వెళ్లిన ఓ బృందం ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన మరో యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు- తెలిసింది. సియాటెల్‌లోని ప్రముఖ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న విష్ణు (48).. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్వతారోహణ కోసం నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి వెళ్లారు. దిగే సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురయ్యింది. ఈ క్రమంలో వారి యాంకర్ పాయింట్ అదుపుతప్పి 200 అడుగుల లోతులో పడిపోయారు. అందులో ప్రాణాలతో ఉన్న ఓ యువకుడు మాత్రం 64కి.మీ మేర నడిచి.. ఎట్టకేలకు సురక్షిత ప్రాంతానికి చేరుకొన్నాడు. ప్రమాద విషయాన్ని అధికారులకు వెల్లడించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. హెలికాప్టర్ సాయంతో మృతదేహాలను బయటకు తీసుకువచ్చినట్లు- సమాచారం. భారత్‌కు చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సియాటెల్‌లో స్థిరపడ్డారు. గ్రేటర్ సియాటెల్‌లో ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ పేరుగాంచిన నిపుణుల్లో ఒకడిగా గుర్తింపు పొందడంతో పాటు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు.

# ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోవద్దు

## - అన్నీ తన ఘనతే అని చాటుకునే రకం
## - మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన వ్యాఖ్యలు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, మే 15 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశానికి చెందిన మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన కామెంట్లు చేశారు. ట్రంప్ ఓ కామెడీ పీస్ అని, భారతీయులు అతడ్ని పట్టించు కోవాల్సిన పని లేదని అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆపింది తానేనని ట్రంప్ ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. భారత్, పాకిస్తాన్‌లు కలిసి భోజనం కూడా చేయాలని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రచారంపై పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ మాట్లాడుతూ.. ప్రతీ దానికి తానే కారణమని ట్రంప్ గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. మీరు గనుక ట్రంప్‌ను అడిగితే.. ఒంటి చేత్తో వరల్డ్ కప్ సాధించానంటాడు. ఇంటర్‌నెట్‌ను కనిపెట్టింది తానేనంటాడు. క్యాన్సర్‌ను నయం చేసింది కూడా తానేనంటాడు. ఈ విషయంలో భారతీయులది కూడా అమెరికన్ల పరిస్థితే. భారతీయులు ట్రంప్ మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. పాకిస్తాన్ మీద కూడా ఆయన దారుణమైన కామెంట్లు చేశారు. పాకిస్తాన్‌ను కుక్కతో పోల్చారు. ఇండియా దెబ్బకు పాకిస్తాన్ తోక ముడిచిన కుక్కలా పారిపోయిందని అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆగిపోవటంలో తన పాత్ర ఎంతో ఉందని డొనాల్డ్ ట్రంప్ ప్రతీ చోటా చెప్పుకుని తిరుగుతున్నారు. వీలు చిక్కినప్పుడల్లా యుద్ధం గురించే మాట్లాడు తున్నారని మండిపడ్డారు. మేము అణుయుద్ధాన్ని ఆపాము. లేదంటే అదో దారుణమైన అణు యుద్ధం అయి ఉండేది. యుద్ధం కారణంగా లక్షల మంది ప్రాణాలు పోయి ఉండేవి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబిన్‌లకు నా కృతజ్ఞతలు. గత శనివారం నా కారణంగానే రెండు దేశాల మధ్య యుద్ధం వెంటనే ఆగిపోయింది. రెండు దేశాల దగ్గర చాలా అణు బాంబులు ఉన్నాయి. రెండు దేశాలు యుద్ధం ఆపడానికి మేము ఎంతో సాయం చేశాము. వ్యాపార పరంగా కూడా సాయం చేస్తున్నాము. యుద్ధం ఆపితేనే వ్యాపారం చేస్తామని చెప్పాము. లేదంటే వ్యాపారం చేయము అని స్పష్టం చేశామని అన్నారు. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా ఉభయ దేశాలూ నష్టపోయాయి. రష్యాకు తిరుగులేని సైనిక శక్తి, ఆయుధ సంపద ఉన్నప్పటికీ... పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అండతో ఉక్రెయిన్ ఎదురొడ్డి నిలబడగలుగుతోంది. రష్యాతో తలపడటానికి అవసరమైన సహాయం కోసం ఉక్రెయిన్ తమ దేశంలోని సహజ వనరులు, ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కులను అమెరికాకు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మరోవైపు రష్యా కూడా పూర్వం ఉన్నట్టుగా ఆర్థికంగా పటిష్ఠంగా లేదు. ఈ క్రమంలో రూబిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇంటర్నెట్ కనిపెట్టడం నుంచి క్యాన్సర్‌ను నయం చేసేవరకు అన్నింటికీ క్రెడిట్ తీసుకోవడం ట్రంప్‌నకు అలవాటేనని రూబిన్ ఎద్దేవా చేశారు. డొనాల్డ్ ట్రంప్ ప్రతిదానికీ క్రెడిట్ పొందేందుకు ఇష్టపడతారు. మీరు ఆయన్ను అడిగితే.. ప్రపంచ కప్‌ను గెలుచుకున్నానని, ఇంటర్నెట్ కనుగొన్నానని, క్యాన్సర్‌ను నయం చేశానని చెప్పుకుంటారు. భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో కూడా ఆయన అదే చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికన్లలాగానే భారతీయులు ఆయన మాటలు పట్టించుకోవద్దు' అని రూబిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భారత్- పాక్‌ల మధ్య వివాదం తలెత్తినప్పుడల్లా అమెరికా తెరవెనుక మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇరుదేశాల మధ్య శాంతి పక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారని కొనియాడారు.

# కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత


## - ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ముష్కరుల హతం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



శ్రీనగర్, మే 15 : జమ్మూకశ్మీర్ అవంతిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాదర్, ట్రాల్ ప్రాంతాల్లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగింది. అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలోగురువారం ఉదయం భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతం చేశాయి. కాగా జమ్మూకశ్మీర్‌లో గడిచిన 48 గంటల్లో ఇది రెండో ఎన్‌కౌంటర్. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న అనుమానంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అటవీప్రాంతాల్లో అణువణువు జల్లెడపడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గాం నిందితులు, ఉగ్రవాదులను భద్రతాబలగాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ వేటలో భాగంగానే ఎన్‌కౌంటర్లు జరుగు తున్నాయి. కొన్ని కొత్త ప్రదేశాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు- గుర్తించిన భద్రతా బలగాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన చొరబాటు- ఉగ్రవాదులను మట్టుబెడుతున్నాయి. గురువారం ఉదయం టెర్రరిస్టుల కోసం గాలించగా నాదర్ , ట్రాల్ ప్రాంతాల్లో తారసపడ్డారు. భద్రతా బలగాలను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వెంటనే భద్రతాబలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించినట్లు- సమాచారం. మరో ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. అవంతిపొరాలో ఎదురుకాల్పులపై కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ ఆరా తీసింది. రెండు రోజుల క్రితం కూడా షోపియాన్ ప్రాంతంలో జిన్‌పాథర్ కెల్లర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆపరేషన్ కెల్లార్ పేరుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులు హతమవడంతో పాటు- భారీగా ఆయుధాలను స్వాధీనం చేస్తున్నారు. అంతేకాకుండా మందుగుండు సామాగ్రిని కూడా భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టు-కోవాలనే సంకల్పంతో భద్రతాబలగాలు ముందుకు సాగుతున్నాయి.

# తుర్కియే సంస్థ సెలెబీ ఏవియేషన్ అనుమతులు రద్దు.. కేంద్రం కీలక నిర్ణయం..



పహల్గాం దాడికి కారణమైన పాక్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియేకు భారత్ తొలి షాకిచ్చింది. తుర్కియేకు చెందిన సెలెబీ ఏవియేషన్ సంస్థకు మంజూరు చేసిన భద్రతా పరమైన అనుమతులను రద్దు చేసింది. భారత్‌లోని తొమ్మిది ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో సెలెబీ ఏవియేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది. క్రిటికల్ ప్యాసెంజర్, కార్గో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందిస్తుంది. ఇందుకోసం గతంలో ఈ సంస్థకు ఇచ్చిన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. జాతీయ భద్రత దృష్ట్యా అనుమతులను ఉపసంహరించుకుంటున్నట్టు వెల్లడించింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్, కన్నూర్, చెన్నై, గోవాలోని ఎమ్ఓపీఏ ఎయిర్‌పోర్టుల్లో సెలెబీ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ ఎయిర్‌పోర్టుల్లోని విదేశీ ఎయిర్‌లైన్స్‌తోపాటు కార్గో ఆపరేటర్లకూ సంస్థ సేవలందిస్తుంటుంది. వైజాగ్ ఎయిర్‌పోర్టు బాధ్యతలు సైతం ఈ సంస్థకు దఖలు పడాల్సి ఉండగా ఇంతలో కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీ క్లియరెన్స్‌ను రద్దు చేసింది. అంతకుముందు సెలెబీపై మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ముంబై ఎయిర్‌పోర్టుకు లేఖ రాసింది. జాతీయ భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. పాక్‌కు తుర్కియే వంత పాడుతున్న విషయాన్ని ప్రస్తావించింది.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com